ఈనాడు
అమరావతి
గుంటూరు
గురువారం అక్టోబరు 24, 2024
5


మురిసిన భవిత


మెరిసిన యువత

అమరపురి.. సృజన సిరి..



ఘనంగా రెండు రోజుల డ్రోన్ సమ్మిట్

ఆశ్చర్యపరిచిన ఆధునిక, సాంకేతిక ప్రదర్శనలు

ఈనాడు, ఈనాడు డిజిటల్ - అమరావతి

మంగళగిరిలో రెండో రోజు ప్రదర్శనకు ఉంచిన ఆధునిక డ్రోన్లను చూసి విద్యార్థులు.. గొప్ప అనుభూతికి లోనయ్యారు. తమకు ఇప్పటివరకూ వీటి గురించి ఇంత అవగాహన లేదని.. తొలిసారి ఇలాంటివి చూస్తున్నామని తెలిపారు. తాము కూడా పెద్దయ్యాక డ్రోన్లను తయారుచేస్తామని విద్యార్థులు ఆనందంగా చెప్పారు. ఇవి చూసి ఎంతో స్ఫూర్తి పొందామని, భవిష్యత్తులో డ్రోన్ల విప్లవం రానుందని.. ఇవన్నీ ప్రత్యేక నిదర్శనమని ఇంజినీరింగ్ విద్యార్థులు పేర్కొన్నారు. తాము ఇప్పటికే పొలాల్లో డ్రోన్లతో పురుగు మందులను పిచికారీ చేయిస్తున్నట్లు కంకిపాడు, పెనమలూరు, ఉయ్యూరు, మంగళగిరి, గుంటూరు ప్రాంతాల రైతులు ఆనందంగా తెలిపారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ల సాయం మరింత పెరిగితే.. రైతులకు ఎంతో ప్రయోజనకరమన్నారు.

రైతన్నకు తోడుగా.. విహార్

ఐఐటీ మద్రాసు విద్యార్థులు, అధ్యాపకుల సహాయంతో 'విహార్' పేరుతో డ్రోన్‌ను తయారు చేశారు. ఐఐటీ ప్రాంగణంలోనే స్టార్టప్ కంపెనీ పెట్టారు. ఈ డ్రోన్‌ను క్రిమిసంహారక మందులు, విత్తనాలు చల్లడానికి వాడవచ్చు. డ్రోన్ కింద అమర్చిన డబ్బాలో మందులను ఉంచి.. పిచికారీ చేయొచ్చు. రైతులు సులభంగా విత్తనాలను కూడా పొలాల్లో చల్లుకోవచ్చు. 30 కిలోల బరువు ఉండే ఈ డ్రోన్‌కు.. 10 లీటర్ల ద్రావణం ఒకేసారి పైకి తీసుకెళ్లి పిచికారీ చేసే సత్తా ఉంది. రెండు గంటల్లో 30 ఎకరాలకు పురుగుమందు పిచికారీ చేయగలదు. 100 అడుగుల ఎత్తు ఎగురుతుంది. తమ డ్రోన్‌కు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) నుంచి టైప్ సర్టిఫికేషన్ ఉందని సంస్థకు చెందిన విఘ్నేశ్ వెల్లడించారు.


విహార్ డ్రోన్



ఈ డ్రోన్లు చూస్తే ఆశ్చర్యం వేస్తోంది..

నేను 12 ఎకరాల్లో వరి, మినుము పండిస్తున్నా. ఇటీవల డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ చేయించా. పంపు సెట్లతో కొడితే.. రోజులు పడుతుంది. పనివారూ దొరకడం లేదు. సొంతంగా డ్రోన్ కొంటే.. నాతోపాటు మా ఊరి రైతులకూ ఉపకరిస్తుందనే ఉద్దేశంతో చూసేందుకు ఇక్కడికి వచ్చా. పెట్రోలు, బ్యాటరీతో ఎక్కువ సమయం ఎగిరే డ్రోన్‌ను కొంటా. ఈ డ్రోన్లను చూస్తే చాలా ఆశ్చర్యంగా ఉంది.

- వి.నర్సింగరావు, రైతు, గుడివాడ



అమరావతి డ్రోన్ సమ్మిట్ చూసేందుకు విజయవాడ, గుంటూరు సహా చుట్టుపక్కల ప్రాంతాల పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పెద్దఎత్తున తరలివచ్చారు. వివిధ ప్రాంతాల రైతులు, ప్రజలు భారీగా విచ్చేసి డ్రోన్ల ప్రదర్శనను తిలకించారు. విజయవాడ కృష్ణా తీరంలో తొలి రోజు నిర్వహించిన.. 5,500 డ్రోన్ల ప్రదర్శన చూపరులను కట్టిపడేసింది. రెండో రోజు డ్రోన్ల సాంకేతికత, సమాజ అవసరాలకు ఎలా వినియోగించాలనే అంశాలపై.. మంగళగిరిలోని సి. కె. కన్వెన్షన్‌లో నిర్వహించిన.. సమావేశాల్లో నిపుణులు పాల్గొని.. అభిప్రాయాలను వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన.. సమ్మిట్‌లో దేశవ్యాప్త సాంకేతిక నిపుణులు వచ్చి తాము రూపొందించిన ఆధునిక డ్రోన్లను ప్రదర్శించి.. ఔరా అనిపించారు.

సర్వైలెన్స్, మ్యాపింగ్‌కు.. సిగ్మా25

'సిగ్మా-25' డ్రోన్ అందరినీ ఆకర్షిస్తోంది. సర్వైలెన్స్, మ్యాపింగ్ సహా పలు అవసరాలకు దీనిని వాడొచ్చు. ఇన్‌డ్రోన్స్ సంస్థ రూపొందించిన ఈ డ్రోన్ అత్యంత తేలికైంది. కేవలం 3.5 కిలోల కంటే తక్కువ బరువు ఉంటుంది. 50 నిమిషాల్లో నాలుగు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని పక్కాగా సర్వే చేస్తుంది. రైల్వే ట్రాక్, రహదారులు, వంతెనలు, ఆయిల్, గ్యాస్ రిఫైనరీలు, వ్యవసాయం, గనులు, విపత్తులు, టెలీకమ్యూనికేషన్, నిర్మాణం, స్మార్ట్ సిటీల నిర్వహణ వంటి అన్ని అవసరాలకూ వాడవచ్చు. ఈ డ్రోన్‌లో పగలు, రాత్రి అత్యంత నాణ్యమైన వీడియోలను రికార్డుచేసే అత్యాధునిక కెమెరా అమర్చారు. బహిరంగ సభలు, ఉత్సవాల నిర్వహణకూ వాడవచ్చు.




రైతులకు, గిరిజనులకు భరోసా...




పెనమలూరు కుర్రాడు **శామ్యూల్** ప్రభుత్వ యంత్రాంగానికి ఉపకరించే డ్రోన్ రూపొందించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో చదివి స్వీడన్‌లో కంట్రోల్ సిస్టమ్స్ ఇంజినీర్‌గా పనిచేశారు. ప్రస్తుతం స్వదేశానికి వచ్చేసి.. విజయవాడ శివార్లలో డ్రోన్‌హబ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను నెలకొల్పారు. రెండు రకాల డ్రోన్లను రూపొందించారు. ఒకటి అడవులు, కొండగుట్టల్లో ఉండే తండాల్లోని వారికి అత్యంత తేలికగా సరకులు, మందులు సహా ఏ అవసరం ఉన్నా తీసుకెళ్లి ఇచ్చే డ్రోన్. మరొకటి... ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేసే ఆటోమేటిక్ డ్రోన్. సాధారణంగా పొలానికి పురుగు పడితే.. మొత్తం పంటకు పిచికారీ చేస్తారు. కానీ.. ఎక్కడ పురుగు పట్టిందో ఆ ప్రదేశాన్నే పక్కాగా ఆధునిక కెమెరా, ఏఐ ద్వారా గుర్తించి.. మందును సరిగ్గా అక్కడే ఈ డ్రోన్ పిచికారీ చేస్తుంది. తద్వారా పురుగు మందు వినియోగం సగానికి తగ్గించొచ్చు. ఐఐటీ తిరుపతి ప్రొఫెసర్ల సహకారంతో దీనిని రూపొందించారు.

సాగులో సగం ఖర్చు తగ్గుతోంది..



20 ఎకరాలు కౌలుకు చేస్తున్నా. నాలుగేళ్లుగా పురుగు మందులు పిచికారీ చేయిస్తున్నా. సాధారణంగా ఇద్దరు మనుషులు రెండు రోజుల్లో 20 ఎకరాలకు మందులు జల్లుతున్నారు. ఒకరికి రోజుకు రూ.500 చొప్పున రూ.2 వేలు ఖర్చు. అదే డ్రోన్‌తో 5 గంటల్లో పని పూర్తయి.. రూ.వెయ్యి వెచ్చిస్తే చాలు. పైగా డ్రోన్‌తో మందుల పిచికారీ చేస్తే వృథా తగ్గుతోంది.

- ఎన్. వెంకటేశ్వరరావు, రైతు, తాడేపల్లి


విద్యార్థికి విజ్ఞానం


డ్రోన్ సమ్మిట్ విజయవంతంగా నడిపించిన బృందాన్ని అభినందిస్తున్న ఉన్నతాధికారులు

కార్పొరేషన్‌లో దొంగలు పడ్డారు!

- హెడ్ వాటర్ వర్క్సులో పాత మోటార్లు, పంపుసెట్లు మాయం
- వెహికల్ షెడ్‌లో కూడా..



ఈనాడు - అమరావతి

గుంటూరు నగర పాలక సంస్థలో ఏం జరుగుతోందో అంతుపట్టని పరిస్థితి. కొన్నేళ్లుగా పేరుకుపోయిన అంతులేని నిర్లక్ష్యం.. అవినీతితో నవ్వులపాలవుతున్నా యంత్రాంగంలో కనీసమాత్రంగానైనా మార్పు రాలేదు. పట్టాభిపురం ప్రధాన రహదారి పక్కనే నిర్మిస్తున్న గ్రీన్‌గ్రేస్ భారీ బహుళ అంతస్తుల భవన నిర్మాణాలకిచ్చిన ఎన్‌వోసీని రద్దు చేస్తూ రైల్వేశాఖ ఇచ్చిన లేఖను ప్రణాళిక విభాగం మాయం చేసిన ఘటనతో జీఎంసీ పరువంతా గంగలో కలిసిపోయింది. ఏది ఏమైతేనేం మా జేబులు నిండితే చాలన్నట్టుంది వివిధ విభాగాల్లోని అధికారుల పరిస్థితి. తాజా ఘటనలే ఇందుకు ఉదాహరణ.

★ తక్కెళ్లపాడులోని హెడ్‌వాటర్ వర్క్సులో నెల రోజుల క్రితం రెండు లారీల ఇనుప సామగ్రి చోరీకి గురైంది. ఓ అధికారి రాత్రికి రాత్రే పాత మోటార్లు, పంపుసెట్లు, ఇంజిన్లను తరలించి రూ.లక్షల్లో సొమ్ము చేసుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇక్కడున్న మోటార్లు, పంపుసెట్లు అన్నీ కనీసం రూ. 10 లక్షల నుంచి రూ. 50 లక్షల ఖరీదు చేసేవే. ఇవి మరమ్మతులకు గురైతే సంబంధిత కంపెనీ మెకానిక్‌లే రావాలి. కాని పక్షంలో వాటిని విక్రయించకుండా భద్రపరుస్తారు. వాటి వివరాలు స్టాకు రికార్డులో నమోదు చేస్తారు. వీటిని పరిశీలిస్తే చాలు ఏయే సామగ్రి చోరీ అయిందో తెలుస్తుంది. అయినా ఓ అధికారి పాత సామగ్రిని బయటకు తరలించేశారంటే నమ్మశక్యంకావడం లేదని, ఈ వ్యవహారంలో పలువురి పాత్ర ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

★ కేవీపీ కాలనీలోని వాహన షెడ్‌లో నాలుగైదు రోజుల క్రితం కొన్ని పరికరాలు మాయమయ్యాయి. కమిషనర్, ఎస్‌ఈ దృష్టికి తీసుకెళ్లకుండా అక్కడి ఉద్యోగులు రెండు రోజుల క్రితం నగరంపాలెం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. తాము వచ్చి పరిశీలించాక ఫిర్యాదు స్వీకరిస్తామని పోలీసులు చెప్పేసరికి మిన్నకుండిపోయారు. ఇక్కడ కొత్త స్పేర్ పార్ట్స్, టైర్లు తదితర సామగ్రి ఉన్నాయి. ఏడాదిన్నర క్రితం ఏపీ ఆగ్రోస్ నుంచి రూ. 30 లక్షల విలువైన టైర్లు, ఇతర సామగ్రిని కొనుగోలు చేశారు. షెడ్‌లో సీసీ కెమెరాలున్నా.. కొంత సామగ్రి మాయం కావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

★ ఇటీవల ఏటీ అగ్రహారం వాటర్ ట్యాంకుల వద్ద కొంత సామగ్రి చోరీకి గురైందని, కారకులెవరో నిగ్గు తేల్చాలని అప్పట్లో వైకాపా కార్పొరేటర్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో దర్యాప్తు జరిపిన కమిటీ ఇంజినీరింగ్ అధికారిని బాధ్యుడిగా గుర్తించినా ఇంతవరకు చర్యల్లేవు. విచారణాధికారులు నివేదికా ఇవ్వలేదు. ఈ మాయం వెనుక పలువురి పాత్ర ఉన్నందునే ఎవరూ పట్టించుకోవడం లేదన్న వాదన వినబడుతోంది.

బాధ్యులను గుర్తిస్తాం

సామగ్రి పోయిన విషయం ఇప్పటివరకు నా దృష్టికి రాలేదు. చోరీ జరిగిందంటే నమ్మశక్యంగా లేదు. అన్నిచోట్లా గార్డులు ఉన్నారు. సీసీ కెమెరాలు ఉన్నాయి. ఆ వ్యవహారాలను నిగ్గు తేల్చి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- ఎస్‌ఈ నాగమల్లేశ్వరరావు

సర్కారు వరం.. పేదింటికి దీపం

ఏడాదిలో మూడు వంటగ్యాస్ సిలిండర్లు ఉచితం

నేటి నుంచే బుక్ చేసుకోవచ్చు

న్యూస్‌టుడే - కలెక్టరేట్ (గుంటూరు)

నిరుపేద కుటుంబాలకు దీపావళి ముందే వచ్చింది. గత ఎన్నికల్లో తెదేపా కూటమి ఇచ్చిన మరో హామీని నెరవేర్చింది. దీపావళి నుంచి దీపం పథకం కింద వంట గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతీ పేద కుటుంబానికి ఏడాదికి మూడు సిలిండర్లను ఉచితంగా ఇవ్వనుంది. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలు త్వరలోనే పౌరసరఫరాల శాఖకు అందనున్నాయి. జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు, పథకాల వారీగా ఉన్న లబ్ధిదారుల వివరాలను అధికారులు సిద్ధం చేశారు. ప్రభుత్వం తాజా ప్రకటనతో నిరుపేద కుటుంబాల ఇంటి బడ్జెట్లో కొంత మొత్తం ఆదా అయినట్టే.



★ జిల్లాలో ఐవోసీ, హెచ్‌పీసీఎల్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ ఆధ్వర్యంలో 7.90 లక్షలకుపైగానే గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. తెల్ల రేషన్ కార్డులను ప్రాతిపదికగా తీసుకుంటే 5,99,511 కుటుంబాలకు లబ్ధి చేకూరుతుంది. ప్రస్తుతం సిలిండర్ ధర రూ. 827గా ఉంది. ఏడాదికి మూడు సిలిండర్లు అంటే ఇప్పుడున్న ధరల ప్రకారం ఒక్కో కుటుంబానికి రూ. 2,481 ఆదా అయినట్టే. భారీ రాయితీతో కూడిన పథకం కావడంతో రాయితీ సిలిండర్లు నల్లబజారుకు తరలిపోకుండా ఉండేలా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకోనుంది.

★ జిల్లాలో గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేయించుకుంటున్నారు. ఒక్కో ఏజెన్సీ పరిధిలో సగానికిపైగానే ఈ ప్రక్రియ పూర్తయిందని యంత్రాంగం చెబుతోంది. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాగానే తదుపరి చర్యలు చేపట్టేందుకు సమాయత్తమవుతోంది.

★ లబ్ధిదారులు గురువారం నుంచి వంట గ్యాస్ బుక్ చేసుకోవచ్చని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అక్టోబరు 31న బుక్ చేసుకున్నా ఉచితంగానే ఇస్తారు. సిలిండరు అందుకున్న రెండు రోజుల్లో లబ్ధిదారుల ఖాతాలకు రాయితీ సొమ్ము జమ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

జిల్లాలో వంట గ్యాస్ కనెక్షన్లు	:	7,90,860
ఇందులో దీపం కనెక్షన్లు	:	1,16,134
ఉజ్వల కనెక్షన్లు	:	8,796
తెల్ల రేషన్‌కార్డుదారులు	:	5,99,511

ప్లాట్లు పొందిన వారికి వారంలో రిజిస్ట్రేషన్లు

సీఆర్డీఏ అదనపు కమిషనర్ ప్రవీణ్ చంద్ వెల్లడి

లాటరీ తీసి రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు


రైతుకు ప్లాట్ల కేటాయింపు పత్రం అందజేస్తున్న సీఆర్డీఏ అదనపు కమిషనర్ సాయిసూర్య ప్రవీణ్‌చంద్

ఈనాడు, అమరావతి: లాటరీలో రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు ఎటువంటి జాప్యం లేకుండా వారం రోజుల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేస్తామని సీఆర్డీఏ అదనపు కమిషనర్ సాయి సూర్య ప్రవీణ్‌చంద్ అన్నారు. బుధవారం సాయంత్రం విజయవాడలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఈ-లాటరీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సమీకరణలో భూములు ఇచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్లను లాటరీ ద్వారా కేటాయించారు. అనంతరం వారికి కేటాయింపు పత్రాలను అందజేశారు. కురగల్లు-1, 2, అబ్బరాజుపాలెం, ఐనవోలు, లింగాయపాలెం, మల్కాపురం, ఉద్దండరాయునిపాలెం, శాఖమూరు, తుళ్లూరు-1, 2, మందడం- 1, 2 గ్రామాల పరిధిలోని 23 మంది రైతులకు 68 కమర్షియల్, రెసిడెన్షియల్ ప్లాట్ల తాలూకూ పత్రాలను ఇచ్చారు.

సీఆర్డీఏ భూములైతే మాకేంటి..?

అక్రమంగా పంటల సాగు చేస్తున్న వైకాపా నాయకులు

గుంటూరు, న్యూస్‌టుడే: ఐదేళ్ల వైకాపా పాలనలో అమరావతిని పూర్తిగా నిర్వీర్యం చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆ పార్టీ మాజీ ఎంపీ నందిగం సురేష్ అనుచరులు, నాయకులు చేసిన అక్రమాలకు అంతే లేదు. సీఆర్డీఏ భూముల్లో అనధికారికంగా పంటల సాగు చేపట్టి భారీగా లబ్ధి పొందారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాతా కొంతమంది వైకాపా నాయకుల్లో ఎలాంటి మార్పు రావడం లేదు. తుళ్లూరు మండలం శాఖమూరుకు చెందిన వైకాపా నాయకుడు జొన్నకూటి ప్రశాంత్‌తో పాటు మరికొంత మంది సుమారు 50 ఎకరాల సీఆర్డీఏ భూముల్లో అనధికారికంగా పంటల సాగు చేస్తున్నారు. సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయం సమీపంలో, లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెం, వెలగపూడి, ఐనవోలు, రాయపూడి, మందడం పరిధిలో ఈ పరిస్థితి నెలకొంది. వీరిలో నందిగం అనుచరులూ ఉన్నారు. సీఆర్డీఏలో గతంలో వైకాపాతో అంటకాగిన పలువురు ఉద్యోగుల సహాయంతో పంటలు సాగు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రాజధాని సీడ్ యాక్సెస్ రహదారిపై పర్యటించిన సందర్భంలో ప్రశాంత్‌తోపాటు మరికొందరు చెప్పులు విసిరారు. అలాంటి వారు ఇప్పుడు సీఆర్డీఏ భూముల్లో పంటల సాగు చేసుకోవడం గమనార్హం. ఉద్దండరాయునిపాలెంలో మాజీ ఎంపీ నందిగం సురేష్ ఇంటి పక్కన సీఆర్డీఏ భూముల్లో అతని అనుచరులు అనధికారికంగా షెడ్లు నిర్మించారు. ఇప్పటికే కరకట్టకు లోపల నదీపరివాహక ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఆయన ఏకంగా పెద్ద భవనాన్నే కట్టేశారు. ప్రస్తుతం ఆ విషయం కోర్టులో విచారణలో ఉంది. ఆయా భూముల్లో ఆక్రమణలు తొలగించాలని, అనధికారికంగా చేపట్టిన పంటల సాగును నిలువరించాలని రాజధాని రైతులు పలు సార్లు ఫిర్యాదులు చేసినా సీఆర్డీఏ అధికారులు పట్టించుకోవటం లేదనే విమర్శలు వస్తున్నాయి.


లింగాయపాలెం సమీపంలో సీఆర్డీఏ కార్యాలయం ఎదుట సాగుకు సన్నద్ధం చేసిన భూమి


మాజీ ఎంపీ నందిగం సురేష్ ఇంటి వద్ద సీఆర్డీఏ స్థలంలో వేసిన అనధికార షెడ్లు


శాఖమూరులో సీఆర్డీఏ భూముల్లో వేసిన మినుప పైరు

ఇక్కడా ఇంతే..!

మంగళగిరి, తాడేపల్లి మండలాల్లో ఉండవల్లి, పెనుమాక, కృష్ణాయపాలెం, యర్రబాలెం, నవులూరు, నీరుకొండ, నిడమర్రు, కురగల్లు, బేతపూడి గ్రామాల్లోని సీఆర్డీఏ భూములో అరటి, పసుపు, మునగ, ఉల్లి, కూరగాయల, పూలతోటలు అధికంగా సాగు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో కొన్ని చోట్ల వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు తొలగించలేదు. వాటినీ ఉపయోగించుకుంటూ దర్జాగా అక్రమ సాగు చేపట్టారు. ఇటు సీఆర్డీఏ నుంచి వార్షిక కౌలు తీసుకుంటూ..మరోవైపు పంట ఉత్పత్తులు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. డిసెంబరు నుంచి రాజధాని పనులు ప్రారంభిస్తామని ప్రభుత్వం చెప్పింది. అయినప్పటికీ అక్రమంగా చేపట్టిన పంట సాగు మాత్రం ఆగడం లేదు.

మూడు మండలాల్లో స్వల్ప వర్షపాతం

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు మూడు మండలాల్లో స్వల్ప వర్షపాతం నమోదైంది. జిల్లా సగటు వర్షపాతం 1.3 మిల్లీ మీటర్లు కాగా.. మంగళగిరి 18, పెదకాకాని 2.8, తాడికొండ 2.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.



సీతానగరం వైపు నదిలోకి కుంగిపోతున్న రక్షణ గోడ



కూలిన రక్షణ గోడ వద్ద ముళ్లకంపలు అడ్డుగా పెట్టారిలా..

కూలిపోతోంది.. కదలి రండి

ప్రకాశం బ్యారేజీ చెంతన కృష్ణానది వెంబడి రక్షణ గోడ దెబ్బతినడంతో సందర్శకులు భయాందోళనలకు గురవుతున్నారు. నదీ ప్రవాహాన్ని తిలకించేందుకు నిత్యం సందర్శకులు తరలివస్తుంటారు. గోడ వెంబడి కాసేపు సేద తీరి సెల్ఫీలతో సందడి చేస్తుంటారు. ఈ క్రమంలో గుంటూరు జిల్లా సీతానగరం వైపు ఉన్న రక్షణ గోడ నదిలోకి కుంగిపోతోంది. కొంత మేర కూలిపోగా.. జలవనరులశాఖ అధికారులు తాత్కాలికంగా ముళ్ల కంప అడ్డుగా వేసి వదిలేశారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా సందర్శకులు నదిలో పడిపోయే అవకాశం లేకపోలేదు. దీనికి తోడు బ్యారేజీ 39వ పిల్లరు వద్ద పాదచారుల బాట వెంబడి రెయిలింగ్ వంగి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

- ఈనాడు అమరావతి, న్యూస్‌టుడే తాడేపల్లి



బ్యారేజీ మధ్యలో రెయిలింగ్ లోపలకు ఒరిగి..

గ్రామీణ బ్యాంకుల ఏర్పాటుకు కేంద్రం సన్నద్ధం



మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రెడ్డి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి గ్రామీణ బ్యాంకుల ఏర్పాటుకు కేంద్రం సన్నద్ధమవుతుందని ఆల్ ఇండియా రీజనల్ రూరల్ బ్యాంక్స్ ఉద్యోగుల సంఘ నేత ఎస్.వెంకటేశ్వర రెడ్డి అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని వెంకటేష్ గ్రాండ్‌లో బుధవారం ఏపీజీవీబీ ఈయూ సమావేశం జరిగింది. వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిందన్నారు. ఏపీజీవీబీఈయూ కృషితో వాణిజ్య బ్యాంకులతో సమానంగా ఇతర అలవెన్సులు కూడా సాధించామన్నారు. తెలుగు వైద్య గోదావరి (గ్రామీణ బ్యాంకుల సంఘ నేతలు) సందర్శించి చైర్మన్ కె.ప్రమోద్‌కుమార్‌రెడ్డిని కలిసి పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో సీజీజీబీ అధికారుల సంఘ ప్రధాన కార్యదర్శి బోడా శ్రీనివాసరావు, అధ్యక్షుడు సీహెచ్.వెంకట్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎండీ మజీద్, సీజీజీబీ స్టాఫ్ ఫెడరేషన్ కార్యదర్శి సీహెచ్.యమలయ్య, కోశాధికారి మూర్తి, అధ్యక్షుడు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

జగన్.. శవరాజకీయాలు మానుకోలేదు

తెదేపా నేతలు ఆలపాటి రాజా, గళ్లా మాధవి ధ్వజం



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్, పక్కన ఎమ్మెల్యే మాధవి, మాణిక్యరావు తదితరులు

గుంటూరు (పట్టాభిపురం), న్యూస్‌టుడే: 'గత అయిదేళ్లు రాష్ట్రాన్ని గంజాయి వనంగా మార్చిన జగన్ పరామర్శల పేరుతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు. యువతి సహన ఘటనపై గుంటూరు వచ్చిన జగన్.. సత్యహరిశ్చంద్రుడు తమ్ముడిలా మాట్లాడుతున్నారు. ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా జగన్ శవరాజకీయాలు మానుకోలేదు' అని తెదేపా సీనియర్ నేత, గుంటూరు-కృష్ణా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి విమర్శించారు. గుంటూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం వారు మీడియాతో మాట్లాడారు. ఆలపాటి మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో తాడేపల్లి ప్యాలెస్ పక్కనే యువతిపై అమానుషం జరిగితే పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అయిదేళ్ల జగన్ పాలనలో వైకాపా నేతలు చేసిన దందాలు, దౌర్జన్యాలు, అత్యాచారాలు, హత్యలు గుర్తు రాలేదా అని ప్రశ్నించారు. మహిళా రక్షణ గురించి జగన్ మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. బీసీ నేత చంద్రయ్యను పాశవికంగా హత్య చేస్తే.. హంతకుల కొమ్ము కాశారన్నారు. రాష్ట్రంలో వైకాపా జులుం సాగించాలని చూస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ ఎక్కడ శవాలు కనిపిస్తే అక్కడ జగన్ రెక్కలు కట్టుకుని వాలిపోతున్నారని, శవ రాజకీయాలు చేసి అధికారంలోకి వచ్చిన జగన్ అదే కలిసి వస్తాయని నమ్ముతున్నారని ఎద్దేవా చేశారు. సహనా ఘటనలో హంతకుడు నవీన్ వైకాపా కార్యకర్త అని ఆయన తల్లి స్వయంగా చెబుతుంటే.. జగన్ మాత్రం అర్థంలేని వాదన చేస్తున్నారని మండిపడ్డారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున పరమాయకుడు టాటా రమ్మని దారుణంగా హత్య చేస్తే.. పరామర్శకు వచ్చిన లోకేశ్‌ను అరెస్టు చేయించారన్నారు. వైకాపా ప్రభుత్వంలో అదృశ్యమైన 30,000 మంది మహిళలు, యువతుల్లో ఎంతమందిని రక్షించగలిగారని నిలదీశారు. ఆస్తుల కోసం తల్లి, చెల్లిపై కేసులు వేస్తున్న జగన్‌కు మహిళల గురించి మాట్లాడే అర్హత లేదని ధ్వజమెత్తారు. రాష్ట్ర లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు మాట్లాడుతూ సొంత నియోజకవర్గంలో నాగమ్మ అనే మహిళను హత్య చేస్తే పరామర్శించని జగన్.. రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించే సీఎం చంద్రబాబును విమర్శించే అర్హత లేదన్నారు. సమావేశంలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు మద్దిరాల మ్యాని, చిట్టాబత్తిన చిట్టిబాబు, జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్, తెదేపా నాయకులు వేమూరుపల్లి శ్రీరాంప్రసాద్, నాయుడు ఓంకార్, బొల్లిన రామారావు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను స్వేచ్ఛగా తిరగనివ్వడమే చంద్రబాబు చేసిన తప్పా?

✦ గత అయిదేళ్లలో ఒక్క బాధితురాలికైనా కన్నీళ్లు తుడిచారా ✦ తెదేపా సీనియర్ నేత ధూళిపాళ్ల ధ్వజం



మాట్లాడుతున్న నరేంద్రకుమార్

గుంటూరు(పట్టాభిపురం), న్యూస్‌టుడే: 'అరాచకానికి, దోపిడీ పాలనకు చిరునామా తాడేపల్లి ప్యాలెస్. అసలు సభ్యత, సంస్కారం లేని గుంటూరులో ఆసుపత్రి వద్ద ఆయన చేసిన వ్యాఖ్యల్ని బట్టి తేటతెల్లమవుతుంది. ప్రతిపక్ష హోదా కూడా లేని జగన్‌ను స్వేచ్ఛగా తిరగనివ్వడమే సీఎం చంద్రబాబు చేసిన తప్పా'.. అని తెదేపా సీనియర్ నేత, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ధ్వజమెత్తారు. గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైకాపా ప్రభుత్వంలో అదే మహిళ న్యాయం కోసం తాడేపల్లి ప్యాలెస్ సమీపంలో మహిళపై అత్యాచారం చేసి హత్య చేసిన హంతకులను కనీసం అరెస్టు చేయడం చేతకాలేదు. రమ్య హత్యకు గురైన సందర్భంలో పరామర్శకు వచ్చిన లోకేశ్‌ను అడ్డగించి హైడ్రామా సృష్టించి ఆయనతో పాటు మాపై అక్రమంగా నాలుగు కేసులు పెట్టించారు. హెలికాప్టర్‌లో గుంటూరు పర్యటనకు వచ్చిన జగన్‌ను ఎవరైనా అడ్డుకున్నారా. అయినా ఆసుపత్రిలో వైకాపా నేతలతో కలిసి గందరగోళం చేసి అడ్డుకున్నట్లు వ్యాఖ్యలు చేశారు'. అని మండిపడ్డారు. 'అనంతపురంలో జరిగిన గ్యాంగ్ రేప్, తెనాలి ఘటనలు జగన్ రెడ్డి పాలన వారసత్వం వల్లే జరిగాయి. రెండు ఘటనల్లో హంతకులను వెంటనే అరెస్టు చేయడం జరిగింది. జగన్ హయాంలో అరాచకాలు, అమానుషాలు చేసిన హంతకుల్ని అరెస్టు చేయకుండా రక్షణ కల్పించారు. పదవుల్ని పోగొట్టిందే గుణపాఠం. అయిదేళ్లలో ఒక్క బాధితురాలికైనా కన్నీళ్లు తుడిచారా? ఎన్నికల్లో ఓడిపోయాక జగన్‌లో అసహనం పెరిగిపోయింది. ఏ సంఘటన జరిగినా రాజకీయంగా వాడుకోవాలని చూస్తున్నారు. దిశ చట్టం గురించి గొప్పగా చెప్పుకుంటున్నారు. అసలు దిశ చట్టమే లేదు. ప్రజలపై ఒత్తిడి చేసి బలవంతంగా దిశ యాప్ డౌన్‌లోడ్ చేయించారు. పోలీస్ స్టేషన్లకు, వాహనాలు రంగులు వేసినంత మాత్రాన దిశ చట్టం ఉన్నట్లా. బాధితుల పక్షాన ప్రభుత్వం పని చేస్తుంది. మహిళలు, యువతుల రక్షణకు ప్రత్యేక విధానంతో ముందుకెళ్తున్నాం'.. అని నరేంద్ర స్పష్టం చేశారు.

ఎనిమిదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య




స్కూల్ వద్ద ధర్నా చేస్తున్న బాలిక కుటుంబ సభ్యులు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరులోని రెడ్డిపాలెం ఇన్నర్ రింగ్‌రోడ్డులోని శ్రీ వైష్ణవి టెక్నో స్కూల్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన ఓ బాలిక(13) శ్రీవైష్ణవి టెక్నో స్కూల్లో వసతి గృహంలో ఉంటూ 8వ తరగతి చదువుతోంది. 'మంగళవారం రాత్రి స్కూల్ నుంచి ఫోన్ చేసి మీ పాపకు సీరియస్‌గా ఉందని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించామంటే హుటాహుటిన బయలుదేరామని, మళ్లీ కొద్దిసేపటికి పాప చనిపోయిందని చెప్పార'ని విద్యార్థిని తండ్రి పేర్కొన్నారు. తన కుమార్తె ఎలా చనిపోయిందని అడుగుతుంటే స్కూల్ వసతి గృహంలో చున్నీతో ఉరి వేసుకొందన్నారని, తర్వాత ఒక్కొక్కరు ఒక్కో రకంగా సమాధానం చెబుతున్నారని వాపోయారు. యాజమాన్యంతో మాట్లాడాలని ప్రయత్నించినా అందుబాటులోకి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం పాఠశాల ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. నల్లపాడు సీఐ వంశీధర్ ఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. బాలిక మృతిపై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు, మృతికి గల కారణాలు తెలుసుకునేందుకు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

విద్యార్థిని మృతిపై విచారణ జరపాలి: విద్యార్థిని మృతిపై కుటుంబ సభ్యులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు, సమగ్ర విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్ డిమాండ్ చేశారు. విద్యార్థిని కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని డీఈవో శైలజను కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ సమీర్, జిల్లా సహాయక కార్యదర్శి యశ్వంత్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ నిర్మాణానికి విరాళం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర సచివాలయ నిర్మాణానికి ముదినేపల్లికి చెందిన అమరావతి అంబాసిడర్ అంబుల వైష్ణవి అర ఎకరం పొలాన్ని విరాళంగా అందించారు. మంగళవారం రాత్రి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఆమె తండ్రి వైద్యుడు మనోజ్‌తో కలిసి డబ్బు అందించారు. అర ఎకరానికి సంబంధించిన రూ.12.5 లక్షలు, హైకోర్టు నిర్మాణానికి బంగారపు గొలుసు అమ్మి రూ.లక్ష విరాళం ఇచ్చారు. గతంలో అమరావతి అభివృద్ధికి ఆమె ఎకరం(రూ.25 లక్షలు), పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కూడా విరాళం అందించారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు విరాళం అందిస్తున్న వైష్ణవి, ఆమె తండ్రి మనోజ్

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, రిటైల్ ధర - 152, చికెన్ విత్‌స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 133, 142, 153 చికెన్ విత్ స్కిన్ - 254 చికెన్ స్కిన్‌లెస్ - 264.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 540 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

సీనియారిటీ జాబితా విడుదల

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: వైద్య విధాన పరిషత్‌లో పనిచేసేందుకు దరఖాస్తు చేసుకున్న ఫార్మసీ అధికారుల సీనియారిటీ జాబితాను విడుదల చేస్తూ ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు సుచిత్ర బుధవారం ఆదేశాలిచ్చారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పని చేస్తున్న 31 మంది వివరాలు ఈ జాబితాలో చేర్చారు. దీనిపై అభ్యంతరాలుంటే 29 లోపు తెలియజేయాలన్నారు.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

పెండింగ్ వేతనాలు చెల్లించండి

మంగళగిరి, : మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థలో పనిచేసే క్లాప్ ఆటోడ్రైవర్లు బుధవారం కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న రెండు నెలలు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు పరిష్కరించేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని ప్రకటించారు. నాయకులు చెంగయ్య, కమలాకర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


నగరపాలక కార్యాలయం ఎదుట క్లాప్ ఆటోడ్రైవర్ల నిరసన

గర్భిణుల ఆరోగ్యంపై దృష్టి

ఫిరంగిపురం గ్రామీణం: ఫిరంగిపురం, నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా వైద్యాధికారి విజయలక్ష్మి ఆకస్మిక తనిఖీ చేశారు. ఓపీ, రికార్డులు పరిశీలించారు. గర్భిణులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ప్రభుత్వం వారికి అందిస్తున్న సేవలు గురించి వివరించారు. తదితర అంశాలపై తగు సూచనలు చేశారు.


సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

? ప్రత్తిపాడులో మల్లాయపాలెం కూడలి సమీపంలోని వీధుల్లో కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. బస్సు దిగి పిల్లలు వస్తుంటే వెంట పడుతున్నాయి. **- శంకర్, ప్రత్తిపాడు.**

✔ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం.
- షేక్ ఖాజా, పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి, ప్రత్తిపాడు

స్పందనకు వందనం

చెత్త తొలగింపు

తాడికొండ, న్యూస్‌టుడే: నిడుముక్కల గ్రామం నుండి బడేపురానికి వెళ్లే ప్రధాన రహదారిలో చెత్త నిల్వ ఉంచి అక్కడే తగులబెడుతున్నారు. పొగతో రోడ్డు కనిపించక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్య ఈనెల 22న 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన నిడముక్కల పంచాయతీ సెక్రటరీ సౌజన్య ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు.

వీధిదీపాలకు మరమ్మతులు

తాడికొండ, న్యూస్‌టుడే: తాడికొండ గ్రామంలోని దక్కన్ పొగాకు కంపెనీ వద్ద వీధిదీపాలు వెలగడం లేదు. రాత్రి వేళ ప్రజలు కాలినడకకు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఈనెల 20న 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి హరిబాబు దీపాలకు మరమ్మతులు చేయించారు.

బాలల హక్కులపై అవగాహన

మేడికొండూరు, న్యూస్‌టుడే: పేరేచర్ల ఇంటెల్ పాఠశాలలో బుధవారం పిల్లల హక్కులు, జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గుంటూరుకు చెందిన రైల్వే చైల్డ్ హెల్ప్ లైన్ (1098) సభ్యులు మాట్లాడుతూ హక్కులను తెలుసుకోవడం వల్ల మానసికంగా ధైర్యంగా ఉండవచ్చునన్నారు. ప్రధానోపాధ్యాయురాలు అశోక రాణి, జయకుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యాల పేరుతో ఒత్తిడి తగదు

పెదనందిపాడు, న్యూస్‌టుడే: స్థానిక తపాలా కార్యాలయం ఎదుట బుధవారం సిబ్బంది నిరసన ప్రదర్శన నిర్వహించారు. లక్ష్యాలు (పథకాల అమలులో) సాధించాలంటూ ఒత్తిడికి గురి చేయడం తగదని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పోస్టుమాస్టర్ సంజీవ రెడ్డి, పోస్టల్ అసిస్టెంట్ మురళీ, నాయకులు గోపాలకృష్ణమూర్తి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల కల.. నెరవేరిన వేళ

హామీలు అమలుచేస్తున్న మంత్రి లోకేశ్

మంగళగిరి వైద్యశాల అభివృద్ధికి నిధులు

మంగళగిరి, తాడేపల్లి, న్యూస్‌టుడే

మంగళగిరిని దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతానని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు ఒక్కొక్కటీ నెరవేర్చేందుకు ముందడుగు వేస్తున్నారు. తొలి విడతగా మంగళగిరి ప్రజలకు మెరుగైన కార్పొరేట్ వైద్యం అందించేందుకు సంకల్పించారు. ఇందులో భాగంగా ఇక్కడి 30 పడకల వైద్యశాలను 100 పడకలుగా ఆధునికీకరించేందుకు రూ.52 కోట్లు నిధులు మంజూరు చేయించారు. దీంతో దశాబ్దాల నాటి కల నెరవేరిందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్య వేదిక ప్రతినిధులు బుధవారం వైద్యశాల వద్ద కేకు కోసి ఆనందం వ్యక్తం చేశారు. ఏపీ ప్రజారోగ్యవేదిక గౌరవాధ్యక్షుడు డాక్టర్ సాయి ప్రసాద్, వంద పడకల వైద్యశాల సాధన కమిటీ కన్వీనర్ డాక్టర్ వంశీకృష్ణ, కోకన్వీనర్లు నల్లపునేని నాగేశ్వరరావు, కోశాధికారి వీవీ ప్రసాద్, ప్రతినిధులు గోవర్ధనరావు, వల్లభనేని వాణి, రవి, చెంగయ్య, తుల్లిమిల్లి రామకృష్ణ, కాపరౌతు సుందరయ్య, వీసం వెంకటేశ్వరరావు, డాక్టర్ వంశీకృష్ణ, తెదేపా బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ మజీద్, సీపీఎం నాయకులు జేవీ రాఘవులు, పిల్లలమర్రి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఆసుపత్రి వద్ద కేకు కోస్తున్న ప్రజారోగ్య వేదిక ప్రతినిధులు

ఎంతో ఆనందదాయకం..



నాణ్యమైన వైద్య సేవలను సామాన్యులకు అందుబాటులోకి తీసుకొస్తున్న మంత్రి నారా లోకేశ్‌కు ధన్యవాదాలు. గత కొంతకాలంగా శిథిలమైన భవనం స్థానంలో వంద పడకల వైద్యశాల రావడం ఆనందదాయకం.
- సూర్యనారాయణ, ఆత్మకూరు, మంగళగిరి మండలం

నాణ్యమైన వైద్యం




మంగళగిరి పట్టణంలో ఉన్న ప్రస్తుత ప్రభుత్వ ఆసుపత్రిని స్థాయి పెంచి వంద పడకలు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది. దీని వల్ల పేదలకు నాణ్యమైన వైద్య సేవలందుతాయి. **- పవన్‌కుమార్, ఉండవల్లి, తాడేపల్లి మండలం**

పేదలకు భరోసా



కార్పొరేట్ ఆసుపత్రులకు వెళితే వైద్యానికి వేల రూపాయలు ఖర్చు అవుతున్నాయి. వంద పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తే పేదలకు ఊరట లభిస్తుంది.
- జయమ్మ, సీతానగరం

మాట నిలబెట్టుకున్నారు



మంగళగిరిని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. ఆ మేరకు వైద్యశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి మాట నిలబెట్టుకుంటున్నారు. ఆసుపత్రి వల్ల అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరుతుంది. **- బాలకృష్ణ, మంగళగిరి**

సీఎం సహాయ నిధి..ఆపన్నులకు పెన్నిధి

మంగళగిరి, న్యూస్‌టుడే: విద్య, ఐటీ శాఖల మంత్రి, మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేశ్ సహకారంతో నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న కొంతమందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నిధులు మంజూరయ్యాయి. దీంతో స్థానిక నేతలు వాటిని అనారోగ్యంతో బాధపడుతూ వైద్యశాలలో చికిత్స పొందిన వారికి చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. మంగళగిరి మండలం కాజ గ్రామానికి చెందిన చెన్నం గోపీకృష్ణకు రూ.7 లక్షలు, ఆత్మకూరు గ్రామానికి చెందిన అప్పికట్ల కామేశ్వరరావుకు రూ.1.58 లక్షలు, చినకాకాని గ్రామానికి చెందిన లింగినేని కృష్ణారావుకు రూ.83,836 విలువైన చెక్కులను సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి గాదె పిచ్చిరెడ్డి, తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి అందజేశారు. తాడేపల్లి మండలం ఉండవల్లికి చెందిన శ్రీకాంత్ కుమార్తె అధిక అనారోగ్యంతో వైద్యశాలలో చికిత్స పొందారు. బాలికకు సీఎం సహాయ నిధి నుంచి నారా లోకేశ్ సహకారంతో రూ.46,443 నగదు మంజూరు చేశారు. ఈ మేరకు చెక్కును స్థానిక నాయకులు జ్యోతిబసు, కిరణ్, రాజేష్ తదితరులు చెక్కును అందజేశారు.


కాజలో బాధితుడికి చెక్కు అందజేస్తున్న పార్థసారథి, పిచ్చిరెడ్డి

పిల్లలందరూ మధ్యాహ్న భోజనం చేయాల్సిందే


పథకం అమలును పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి ఉమాదేవి, ఎంపీడీవో లక్ష్మీదేవి

పెదనందిపాడు, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజన పథకం అమలును మండల ప్రత్యేక అధికారి ఉమాదేవి ఆకస్మిక తనిఖీ చేశారు. సంబంధిత దస్త్రాలను పరిశీలించారు. విద్యార్థులు 253 మంది హాజరు కాగా 199 మంది మాత్రమే భోజనం చేయడంపై ఆరా తీశారు. అందరూ భోజనం చేసేలా చర్యలు తీసుకోవాలని, మిగిలిన వారి తల్లిదండ్రులను పిలిపించి సమావేశం ఏర్పాటు చేయాలని ప్రధానోపాధ్యాయిని లక్ష్మీదుర్గను ఆదేశించారు. ఎంపీడీవో లక్ష్మీదేవి, ఎంఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పంట నష్ట పరిహారం అవకతవకల లెక్క తేలింది

రూ.17.50 లక్షలు రికవరీ

మేడికొండూరు, న్యూస్‌టుడే: మేడికొండూరు మండలం యలవర్తిపాడు రెవెన్యూ పరిధి పంట నష్ట పరిహారం లబ్ధి విషయంలో జరుగుతున్న విచారణకు తెరపడింది. గ్రామంలో బుధవారం 7వ రోజు విచారణ కొనసాగింది. భారీ కుంభకోణం జరిగిందని అధికారులు నిగ్గు తేల్చారు. అవకతవకలకు సంబంధించి మొత్తం రూ.17.50 లక్షలు తిరిగి రికవరీ చేసినట్లు తెలిపారు. ఏడీఏ(డీఆర్‌సీ) సునీత, ఫిరంగిపురం ఏవో వాసంతి తెలిపిన వివరాల మేరకు.. యలవర్తిపాడు రెవెన్యూ పరిధిలో గతంలో పత్తి పంట దెబ్బతింది. ఆ సమయంలో 108 మంది రైతులకు గాను 265 ఎకరాల్లో పంట పాడైయిందని అధికారులు అర్హుల జాబితా తయారు చేశారు. ఆ నేపథ్యంలో ప్రభుత్వం పంట నష్ట పరిహారం కింద మొత్తంగా రూ.26.50 లక్షలు జమ చేసిందని తెలిపారు. ఈ క్రమంలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి అర్హత లేని మూడో వ్యక్తుల పేరుతో పంట నష్టం సొమ్ము జమ అయిందని తెలిపారు. ఈ క్రమంలో 41 మంది స్వయంగా మొత్తం రూ.17.50లక్షల రూపాయలు తిరిగి చెల్లించారని తెలిపారు.

కౌలుదారు గుర్తింపు కార్డులతో..: పొలం హక్కుదారులు, కౌలు రైతులకు తెలియకుండా కౌలుదారు గుర్తింపు కార్డులు తీసుకుని వాటి ఆధారంగా కుంభకోణానికి పాల్పడ్డారని తెలిపారు. ఎలాంటి పంట సాగు చేయని ఖాళీ భూములు, మిరప తోటలు వేసిన పొలాలు సైతం తప్పుగా చూపెడుతూ లెక్కలో చేర్చారని వివరించారు. పత్తి పంట నష్టం జరిగినా కొంత మందికి పరిహారం అందలేదని కొంతమంది తమ దృష్టికి తెచ్చారని తెలిపారు. విచారణ నివేదిక ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.


యలవర్తిపాడులో వివరాలు సేకరిస్తున్న అధికారులు

భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

పెదనందిపాడు, దుగ్గిరాల, న్యూస్‌టుడే: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం గ్రామ సభలు ఏర్పాటు చేసిందని ఉప తహసీల్దార్ కరీముల్లా అన్నారు. సమగ్ర భూ సర్వే జరిగిన అన్నవరంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వివిధ సమస్యలపై 20 మంది రైతులు ఆయనకు అర్జీలు అందజేశారు. * దుగ్గిరాల మండలం చింతలపూడిలో గ్రామసభకు బుధవారం 65 అర్జీలు వచ్చాయి. వీటిలో విస్తీర్ణంలో వ్యత్యాసంపై 40, పేర్లు మార్పు తదితర అంశాలపై 25 వచ్చాయి. వీటన్నింటినీ పరిష్కరిస్తామని తహసీల్దార్ సునీత చెప్పారు. సర్వేయర్ గోపాలరావు, ఆర్ఐ త్రివేణి, వీఆర్వో జయకాంత్ తదితరులున్నారు.

స్కేటింగ్ పోటీల్లో సత్తా

నూతక్కి(మంగళగిరి), న్యూస్‌టుడే: విద్య భారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన జాతీయ స్కేటింగ్ పోటీల్లో నూతక్కి గ్రామంలోని విజ్ఞాన్ విహార్ పాఠశాల విద్యార్థులు ఐదుగురు పతకాలు సాధించారు. ఒక బంగారు, రెండు సిల్వర్, రెండు కాంస్య పతకాలు గెలుపొందినట్లు ప్రధానోపాధ్యాయుడు సురేష్ తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ఆ రోడ్డా.. అయితే కష్టమే..!

రేవేంద్రపాడు నుంచి నూతక్కి వెళ్లే ప్రధాన మార్గం గుంతలుపడి ప్రమాదభరితంగా మారింది. మలుపుల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అటుగా రాకపోకలు అంటేనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గత ఐదేళ్ల పాటు వైకాపా ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవని, కూటమి ప్రభుత్వం చొరవ చూపి బాగుచేయిస్తే తాము సురక్షితంగా గమ్యస్థానాలు చేరతామని స్థానికులు కోరుతున్నారు.
-న్యూస్‌టుడే, నూతక్కి(మంగళగిరి)



సంచార వైద్యానికి సెలవ్

నూతక్కి గ్రామంలోని ఆరోగ్య కేంద్రంలో ప్రజా అవసరాలకు వినియోగించే సంచార చికిత్స వాహనం నిరుపయోగంగా వదిలివేశారు. ఇప్పటికే వైద్యుల కోసం నిర్మించిన క్వార్టర్స్ శిథిలమయ్యాయి. దీంతో అక్కడ సిబ్బంది నివాసం ఉండటంలేదు. ఇతర ప్రాంతాల నుంచి వైద్యులు విధులకు వస్తుండడం వల్ల అత్యవసర సమయాల్లో గ్రామస్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. **-న్యూస్‌టుడే, నూతక్కి(మంగళగిరి)**


మూలకు చేరిన వాహనం

రాయితీపై సెనగలు

పెదనందిపాడు, న్యూస్‌టుడే: రాయితీపై రైతులకు ప్రభుత్వం సెనగలు సరఫరా చేయనుందని పైరు వేయదలచిన వారు రైతు సేవా కేంద్రాలలో పేర్లు నమోదు చేసుకోవాలని ఏవో సుధారాణి అన్నారు. అబ్బినేనిగుంటపాలెం, గొరిజవోలుగుంటపాలెంలలో బుధవారం పొలాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

చిన్నారులకు దుస్తుల వితరణ

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమెరికాలో నివసిస్తున్న ప్రవాసాంధ్రులు బొద్దులూరి కృష్ణచైతన్య ఆర్థిక సహాయంతో వెంకటపాలెం సమీపంలోని 'చిగురు' బాలల ఆశ్రమంలోని అనాథ చిన్నారులకు బుధవారం దుస్తులు సమకూర్చారు. కార్యక్రమానికి దొండపాడు గ్రామానికి చెందిన స్ఫూర్తి సేవా సంస్థ టి. రవి, తుళ్లూరు మాజీ ఎంపీటీసీ జొన్నకూటి ఏడుకొండలు, చిగురు ఆశ్రమం ఫాదర్ జయరాజులు హాజరై బాల బాలికలకు రెడీమేడ్ దుస్తులు పంపిణీ చేశారు.

ఎంఎస్ఎంఈల గుర్తింపునకు సర్వే

మేడికొండూరు, న్యూస్‌టుడే: మేడికొండూరు మండలంలో బుధవారం అధికారులు సర్వే ప్రారంభించారు. మండల కేంద్రంలో జరుగుతున్న సర్వేను ఎంపీడీవో చందన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మేడికొండూరు మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందని తెలిపారు. ఇందులో భాగంగా సూక్ష్మ, మధ్య, చిన్న తరహా పరిశ్రమలను (ఎంఎస్ఎంఈ) గుర్తిస్తున్నట్లు తెలిపారు. 'ఉద్యమ్' యాప్ ద్వారా దుకాణాలకు అక్కడికక్కడే రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు తెలిపారు.

తెగుళ్ల నివారణతో మేలైన దిగుబడి

తుళ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని పెదపరిమిలో వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు, అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వనరుల కేంద్రం శాస్త్రవేత్తలు ఎం. హైమావతి, లాం ఫాం నుంచి ఎన్. మనోజ్, వెంకట లక్ష్మి, రాజేష్ చౌదరి, మంగళగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు జి. శ్రీనివాసరెడ్డి, మండల ఏ.ఓ కె.శ్రీరంజని హాజరై స్థానిక రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి పంటలో వేరు కుళ్లు, ఆకుమచ్చ తెగుళ్లు, ఉద్ధృతి ఎక్కువగా ఉందని గుర్తించటం జరిగింది. వీటి నివారణ కోసం లీటరు నీటికి కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు, సాప్ 3 గ్రాములు మొక్కలపై జల్లాలని సూచించారు.

హామీ నెరవేర్చాలి

మంగళగిరి: కూటమి ప్రభుత్వం ఇచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని అమలు చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. మంగళగిరి ఎన్నారై జంక్షన్ నుంచి బస్‌స్టాండ్ వరకు ప్రదర్శన నిర్వహించారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

తాడికొండ, న్యూస్‌టుడే: సహన మృతికి కారకుడైన నిందితుడు నవీన్‌ను కఠినంగా శిక్షించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు గాంధీ రామ్మోహనరావు డిమాండ్ చేశారు. తాడికొండ పోలీస్‌స్టేషన్ వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రేమ పేరుతో వంచించి పెళ్లి చేసుకోమని అడిగినందుకు దాడి చేయడం దారుణమన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలంతా బాధిత కుటుంబానికి మద్దతుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రేమ్‌కుమారి, సరళ, రజని, సీఐటీయూ నాయకులు చింతల భాస్కరరావు, కనగాల పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.


తాడికొండ పోలీస్‌స్టేషన్ వద్ద సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన

అమ్మాయిలు అదరగొడుతున్నారు..!

రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణిస్తున్న 'నూతక్కి' బాలికలు

నూతక్కి(మంగళగిరి), న్యూస్‌టుడే

మంగళగిరి మండలం నూతక్కి ప్రధాన మంత్రి శ్రీ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చాటుతున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తూ ఊరుకు మంచి పేరు తెస్తున్నారు. అథ్లెటిక్స్, వాలీబాల్, బ్యాడ్మింటన్, రగ్బీ తదితర పోటీల్లో తమదైన శైలిలో రాణిస్తున్నారు.

మొత్తం విద్యార్థులు 500
క్రీడాకారులు 45


వాలీబాల్ ఆటలో బాలికలు

వాలీబాల్, రగ్బీలో 'వారెవ్వా'



పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న దాసరి షారున్ కృపావలి రగ్బీ, ఎ.శ్రీలక్ష్మీ వాలీబాల్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో బంగారు పతకాలు సాధించారు. 2022 నుంచి శిక్షణ పొందుతున్న వీరు ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన పోటీల్లో ఆయా విభాగాల్లో సత్తాచాటారు. కర్నూలులో 2023లో రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీల్లో బంగారు పతకాలు సాధించి జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. అదే ఏడాది ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో జరిగిన పోటీల్లో రాణించి అండర్-17 విభాగంలో ప్రోత్సాహక బహుమతులు సాధించారు.

బ్యాడ్మింటన్ 'బంగారం'



జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సయ్యద్ జుబేరి బ్యాడ్మింటన్‌లో విశేషంగా రాణిస్తోంది. 2023లో నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగిన అండర్-17 రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకం సొంతం చేసుకుంది. దీంతో పాటు ఇటీవల స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన పోటీల్లో సత్తా చాటి బహుమతి అందుకుంది. జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించాలనే లక్ష్యంతో నిరంతరం శ్రమిస్తోంది.

వైద్య శిబిరం

పెదనందిపాడు: మండలంలోని అబ్బినేనిగుంటపాలెంలో తెదేపా ఆధ్వర్యంలో చిమటా సంజీవ్ కల్యాణ మండపంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎముకల, కీళ్ల వైద్యుడు పి. కృష్ణ ప్రవంత్ (గుంటూరు) 100 మందికి వైద్య పరీక్షలు చేశారు.

అదుపు తప్పి కారు బోల్తా

ఒకరి మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: విజయవాడ నుంచి చిలకలూరిపేట వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి బోల్తా కొట్టడంతో ఒకరు మృతి చెందగా.. ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. నల్లపాడు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యడ్లపాడు మండలం సొలస గ్రామానికి చెందిన కొండెపోగు అంకమ్మరావు(32), షేక్ నజీర్‌లు కారులో సత్తుపల్లి వెళ్లి డ్రోన్ కెమెరాలు మరమ్మతులు చేయించుకుని చిలకలూరిపేటకు బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న కారు గుంటూరు గ్రామీణం పరిధిలోని బుడంపాడు వద్ద అదుపుతప్పి జాతీయ రహదారి పక్కన ఉన్న రక్షణ గోడను ఢీకొట్టి సర్వీస్ రోడ్డులోకి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో అంకమ్మరావు అక్కడికక్కడే మృతి చెందగా.. డ్రైవర్ షేక్ మౌలాలి, నజీర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని, క్షతగాత్రులను గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మృతుడి భార్య కమలకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ వంశీధర్ తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీ: నలుగురికి తీవ్ర గాయాలు

ముట్లూరు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై వట్టిచెరుకూరు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసనాయక్ తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం తేదీ రాత్రి చేబ్రోలు నుంచి ముట్లూరు గ్రామానికి కాకుమాను జాన్‌బాబు తన కుమార్తెతో బైక్‌పై బయలుదేరారు. అదే సమయంలో ముట్లూరు నుంచి తిరుమలశెట్టి నాగార్జున, మరో వ్యక్తితో కలిసి బైక్‌పై వస్తున్నారు. ఎదురెదురుగా వస్తున్న ఈ రెండు వాహనాలు ఢీకొనడంతో నలుగురికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను గుంటూరు నగరంలోని వైద్యశాలలకు తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ చెప్పారు.

ల్యాప్‌టాప్‌లు, చరవాణుల చోరీ

తుళ్లూరు: రాజధాని ప్రాంతంలోని ఓ వసతి గృహంలో ఉంటున్న విద్యార్థుల ఉపకరణాలు చోరీకి గురయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వీఐటీ యూనివర్సిటీలో చదువుకుంటున్న కొందరు విద్యార్థులు సమీపంలోని ఐనవోలు గ్రామంలో సూర్య వసతి గృహంలో అద్దెకు ఉంటున్నారు. ఈ నెల 18న విద్యార్థులు లేని సమయంలో అపరిచిత వ్యక్తులు లోపలికి వచ్చి రూ.లక్ష విలువైన అయిదు ల్యాప్‌టాప్‌లు, నాలుగు చరవాణులు అపహరించారు. విద్యార్థుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

విజ్ఞాన్, ఐసీఏఆర్ఎన్ఏఏఆర్ఎం మధ్య అవగాహన ఒప్పందం

పొన్నూరు, న్యూస్‌టుడే: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ, హైదరాబాద్‌లోని ఐసీఏఆర్ఎన్ఏఏ ఆర్ఎం (నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్) మధ్య అవగాహన ఒప్పందం కుదిరిం దని ఉపకులపతి పి.నాగభూషణ్ బుధవారం వెల్లడిం చారు. విజ్ఞాన్ ఉపకులపతి పి.నాగభూషణ్, ఐసీఏఆర్ ఎన్ఏఏఆర్ఎం డైరెక్టర్ సీహెచ్.శ్రీనివాసరావు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకులు పరిశోధకుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడానికి ఉమ్మడి శిక్షణ,అ వగాహన సదస్సులు నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రస్తుతం పరిశ్రమలు, ఉన్నత విద్యాసంస్థలు సవాళ్లను పరి ష్కరించడం వాటికి వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో ఉమ్మడిగా కృషి చేస్తామని పేర్కొన్నారు.

తెనాలి

•తెనాలి •పొన్నూరు

ట్రాఫిక్‌కు అంతరాయం

పట్టణంలోని తెనాలి-గుంటూరు వంతెనపై బుధవారం సాయంత్రం భారీ లోడ్‌తో వస్తున్న లారీ అకస్మికంగా ఆగి పోయింది. దీనితో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపో యాయి. దాదాపు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభిం చింది. డీజిల్ అయిపోవటంతో లారీ నిలిచిందన్న సమాచా రంతో పోలీసులు లారీలో కొంత ఇంధనం పోయించి ముందుకు తీసుకువచ్చారు. - న్యూస్‌టుడే, తెనాలి టౌన్



ఎవరికీ పట్టని ప్రజల గోడు!

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే

వైకాపా ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో పట్టణ పరిధి సాలిపేట చుట్టు పక్కల ప్రాంతాల్లో అభివృద్ధి పనుల ప్రతిపాదనలు ఆచరణకు నోచుకోక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. గత తెదేపా హయాంలో చేపట్టిన ఉచిత కుళాయిలను లక్ష్యం మేరకు ఇవ్వకుండా వైకాపా పాలకులు నిధు లను వెనక్కి పంపించారు.

తరలించని జంతు వధశాల.. సాలిపేట చుట్టు పక్కల ప్రాంతం లోని జంతువధశాల వ్యర్థాలను సాగునీటి కాలువల్లోకి వదలడంపై పర్యావరణ మండలి వారు తీవ్ర అభ్యంతరం తెలిపి లైసెన్స్‌నూ రద్దు చేశారు. అప్పటి కమిషనర్, ఆరోగ్యా ధికారి జంతవధశాలను పట్టణం వెలుపలకు తరలిస్తా మని కోరడంతో లైసెన్స్‌ను పునరుద్ధరించారు. అప్పటి నుంచి అధికారులు ఆ ఊసే ఎత్తడం లేదు. వైకాపా ప్రభుత్వ హయాంలో జంతు వధశాలను పులే కాలనీకి తరలించి రక్షిత మంచినీటి పథకం రిజర్వాయర్ నిర్మిస్తా మని ఇచ్చిన హామీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. కబేళా బయట రోడ్డుపై గొడ్డు మాంసం అమ్మకాల నిర్వహణపై స్థానికులు అభ్యంతరం తెలిపినా అధికారులు పట్టనట్లు ఉన్నారు. కబేళాలో పశువులు, గొర్రెలను ఉంచి అపరిశుభ్రం చేస్తున్నా అధికారులు అటు వంక రావడం లేదు. పశు వైద్యుడ్ని నియమించకుండా జంతువుల వధ చేస్తుండం గమనార్హం.



ప్రాథమిక పాఠశాల వద్ద సీసీ రోడ్డు అంచులో వేయని మట్టి..

సాలిపేటలో వెంటాడుతున్న సమస్యలు

వార్డులు	: 17,18,19,20
కుటుంబాలు	: 3,890
జనాభా	: 14,030


★ సాలిపేట భిక్షావతి బజార్ లోని లక్ష్మీనారాయణ సదన్ పక్క రోడ్డులో మందుబాబులు బెడద ఎక్కువగా ఉంది. ★ మురుగు కాలువల్లో దోమల నిర్మూలనా మందు పిచికారీ చేయట్లేదని స్థాని కులు పేర్కొన్నారు. ★ సాలిపేట ప్రాథమిక పాఠశాలలో పక్కన వేసిన సీసీ రోడ్డుకు బరమ్స్ పోయలేదు. ★ పాలపర్తివారి వీధిలోని వీధి కుక్కలు సంచారంతో పిల్లలు అటువైపునకు వెళ్లాలంటే భయపడుతున్నారు. ★ ఇంటింటికీ ఇచ్చిన కుళాయిలు అలంకారప్రాయంగా మారాయి. ఇచ్చిన కుళాయిల్లో మూడొంతులకు పైగా నీరు సరఫరా కావడం లేదని యజమానుల నుంచి ఫిర్యాదులు ఉన్నాయి.

రాకపోకలకు అంతరాయం



సాలిపేట, వహాబ్ రోడ్లలో వాహనాలను నిలిపి మరమ్మతులు చేస్తుండటంతో ట్రాఫిక్ రద్దీ పెరిగి వాహనాల రాకపోకలకు తీవ్ర అంత రాయం కలుగుతోంది. మెకానిక్‌లకు ప్రత్యామ్నాయం చూపి వాహనాల రద్దీ లేకుండా చూడాలి. ఇంట్లో బోరు ఉందని మున్సిపల్ కుళాయి పెట్టించుకోలేదు. కానీ ఇంటిపన్నులో కలిపి నీటి పన్ను విధిస్తున్నారు. **- చంద్రబాబు, సాలిపేట**

తాగునీరు రావడంలేదు



సుమారు 20 ఏళ్ల నుంచి భిక్షావతి బజార్‌లో అద్దెకు ఉంటున్నా. మున్సిపల్ కుళా యిలు బిగించినా తాగునీరు రావడం లేదు. ఎందుకు బిగించారో వారికే తెలియాలి. జవాబుదారీతనం కొరవడింది. **- సాంబశివరావు, సాలిపేట**



విరిసిన ప్రతిభ

పట్టణ పరిధి గంగానమ్మపేటలోని శ్రీచైతన్య పాఠశా లలో 'ఈనాడు' ఆధ్వర్యంలో బుధవారం 'అంతర్జాల వినియోగంలో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశంపై 8,9,10 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ పోటీల్లో జి.పూజిత (తొమ్మిదో తరగతి) ప్రథమ, ఎన్.హర్ష (పదో తరగతి) ద్వితీయ, కె.భానుశ్రీ (ఎనిమిదో తరగతి) తృతీయ స్థానాలు పొందగా పాఠశాల ప్రిన్సిపల్ బి.రాధ, డీన్ మల్లికార్జున్ విజేతలను అభినందించి బహుమతులు, ధ్రువపత్రాలు అందించారు. - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

విద్యార్థుల ఉత్సాహం



'ఈనాడు' ఆధ్వర్యంలో పట్టణంలోని చెంచుపేటలోని ఎన్ఆర్ఐ ఇండియన్ స్ప్రింగ్స్ ఉన్నత పాఠశాలలలో బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'అంతర్జాల వినియోగంలో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశంపై 8,9,10 తరగతుల విద్యార్థులు తమ విశ్లేషణలను అందించారు. ఈ పోటీల్లో పదో తరగతి విద్యార్థినులు ఎన్.నీలిమ ప్రథమ, జి.నవీనదీప్తి ద్వితీయ, తొమ్మిదో తరగతి విద్యార్థిని జి.సహశ్రీ తృతీయ స్థానా లను కైవసం చేసుకోగా.. పాఠశాల డీన్ వాసిరెడ్డి కిషోర్‌బాబు విజేతలను అభినందించి బహుమతులు, ధ్రువపత్రాలు ఇచ్చారు. సీఈవో ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపల్ సీతారామయ్య, ఉపాధ్యా యులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

ఏఎన్‌యూలో ముగిసిన అంతర్ కళాశాలల బాస్కెట్ బాల్ పోటీలు

ఏ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాల యంలో గత రెండు రోజులుగా జరు గుతున్న అంతర్ కళాశాలల బాస్కెట్ బాల్ పోటీలు బుధవా రంతో ముగిశాయి. మొత్తం 8 కళా శాలలకు చెందిన జట్లు పాల్గొనగా.. గుంటూరు ఏసీ కళాశాల మొదటి స్థానంలో నిలిచింది. చోడవరం ఆర్ వీఆర్ అండ్ జేసీ కళాశాల రెండు, ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల మూడో స్థానంలో నిలిచాయి. విజేతలకు ఆర్ట్స్ కళా శాల ప్రిన్సిపల్ ఆచార్య స్వరూపా రాణి బహుమతులు ప్రదానం చేశారు. ఈ టోర్నమెంట్‌లో సత్తా చాటిన క్రీడాకారులను నవంబరు 1నుంచి 5 వరకు బెంగళూరులోని క్రైస్ట్ విశ్వవిద్యాలయంలో నిర్వ హించే అంతర్ విశ్వవిద్యాలయాల బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌కు ఎంపిక చేస్తామని వ్యాయామ విభాగం సంచాలకులు ఆచార్య పాల్‌కుమార్ చెప్పారు. కార్యక్ర మంలో డాక్టర్ సూర్యనారాయణ పాల్గొన్నారు.



ట్రోఫీతో విజయం సాధించిన గుంటూరు ఏసీ కళాశాల జట్టు

? 15వ వార్డు రామాలయం వద్ద రహదారిపై ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. అనేక సార్లు ఫిర్యాదు చేసిన మరమ్మ తులు చేయలేదు. **-కె.బాబురావు**

✔ గొయ్యి పూడ్చిస్తాం. **-అపర్ణ, సహాయ ఇంజినీర్**

? నిడుబ్రోలు శృంగారపేటలో రెండు రోజులు చెత్త పేరుకుపో యింది. ఆ మార్గంలో రాకపోకలకు చాలా ఇబ్బందికరంగా ఉంది. **-ఎన్.డేవిడ్**

✔ చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- శ్రీనివాస రావు, ప్రజారోగ్యశాఖాధికారి** -న్యూస్‌టుడే, పొన్నూరు

స్పందనకు వందనం

వీధి దీపాలు వెలిగాయి.. పట్టణ 14వ వార్డు, నాజరుపేటలో వీధి దీపాలు వెల గటం లేదని స్థానికులు 'ఈనాడు' ద్వారా ఈ నెల 23న మున్సిపల్ అధికారులకు తెలియచేయగా సమస్యలు పరిష్కారం అయ్యాయి. **-న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

'ఆచార్య సాయిబాబాను అమానుషంగా బలితీసుకున్నారు'

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: దేశంలోని పీడిత ప్రజలు, ఆదివాసుల హక్కులను ఉద్దేశ పూర్వకంగా హరించిన పాలకులను దివంగత ఆచార్య సాయిబాబా నిలదీసి న్యాయం చేయాలని ఉద్యమించారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక, భారత్ బచావో, భిన్న స్వరాలు తెనాలి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ హాలులో నిర్వ హించిన సాయిబాబా సంస్మరణ సభలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి అరసం కార్యదర్శి కనపర్తి బెన్‌హర్ అధ్యక్షత వహించారు. ప్రజాస్వా మ్యాన్ని ఖూనీ చేసి దివ్యాంగుడైన ఆచార్యునిపై అక్రమ కేసులు బనాయించి కారాగారంలో కఠి నంగా శిక్షించి బలి తీసుకున్నారని వక్తలు ఆందో ళన వ్యక్తం చేశారు. తొలుత నిర్బంధ వ్యతిరేక వేదిక నాయకుడు కె.రవిచంద్ర, విరసం కార్యదర్శి అరసవల్లి కృష్ణ, సీపీఎం నాయకుడు కొల్లిపర బాబూప్రసాద్, సీపీఐ ఎంఎల్ నాయకులు మోపి దేవి రామ్‌దేవ్, ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయ కుడు రావూరి శివకృష్ణ, మానవహక్కుల వేదిక, భిన్నస్వరాలు నాయకుడు గోపాళం శివ నాగేశ్వర రావు, ఎన్.జె.విద్యాసాగర్, గోపాల్, మోజెస్ సాయి బాబు చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు.



మాట్లాడుతున్న వక్త ఎన్.జె.విద్యాసాగర్

మహిళలపై దాడులు అరికట్టాలి

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: రాష్ట్రంలో పెరిగి పోతున్న మహిళలపై దాడుల నియంత్రణకు చిత్తశుద్ధితో చర్యలు తీసు కోవాలని సీఐటీయూ నాయకుడు కొల్లిపర బాబు ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ దాడులను అరికట్టాలని కోరుతూ బుధ వారం పట్టణంలో నిర్వహించిన ప్రదర్శనను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తెనాలి ఐతానగర్‌కు చెందిన మదిరి సహన కుటుంబానికి తీవ్ర అన్యాయం జరిగిందని, ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అంగన్‌వాడీ నాయకురాలు ఎ.వి. యన్.కుమారి కోరారు. సంఘం నాయకులు హసీన్, వలి, లావణ్య, పుష్ప, పావని, రత్నకుమారి, నాగలక్ష్మి పాల్గొన్నారు. **చేబ్రోలు,న్యూస్‌టుడే:** సహనను హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీ నారాయణ డిమాండ్ చేశారు. యువతి హత్యను నిరసిస్తూ స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక నాయకులు రాఘవయ్య, హనుమంతరావు, శారద, దీపిక తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో అంగన్‌వాడీ కార్యకర్తలు

ఇంజినీర్లు పరిశోధనలపై దృష్టి సారించాలి

పెదకాకాని: ఇంజనీర్లు పరిశోధనలు, ఆవిష్కరణ లపై దృష్టి సారించాలని గ్లోబల్ ఫోరమ్ ఫర్ సస్టైన బుల్ ట్రాన్స్ఫర్మేషన్ ఉపా ధ్యక్షుడు డాక్టర్ రామ్మోద్ వెలమాటి అన్నారు. నంబూరు వీవీఐటీ ఇంజినీ రింగ్ కళాశాలలో బుధవారం నిర్వ హించిన విజన్ 2047 సదస్సుకు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ సీఎం చంద్రబాబు విజన్ వల్ల దేశంలో పర్ క్యాపి టల్‌లో హైదరాబాద్ ముందుందన్నారు. కార్యక్రమంలో ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.



డాక్టర్ రామ్మోద్ వెలమాటికి జ్ఞాపికను అందజేస్తున్న ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

మట్టిలో మాణిక్యాలు.. క్రీడల్లో మెరిశారు

కొల్లిపర, న్యూస్‌టుడే: నిరుపేద కుటుంబాలు.. చదువుతోంది ప్రభుత్వ పాఠశాలల్లో.. క్రీడల్లో తమ ప్రతిభ చాటుకున్నారు... స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పర్యవేక్షణలో జరిగిన పోటీల్లో కొల్లిపర మండలం తూములూరు, అత్తోట, మున్నంగి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచారు.



జాతీయస్థాయికి ఎదిగి: మున్నంగి జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి **కొప్పుల నందు** అండర్-19 త్రోబాల్ ఆటలో నియోజకవర్గం, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాడు. విశాఖలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా నిలిచాడు. హైదరాబాద్‌లో త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో తలపడ నున్నాడు.



బరువులెత్తడంలో దిట్ట : తూము లూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠ శాల పదో తరగతి విద్యార్థి **తుల్లిమిల్లి జోషిడానియేల్** మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో చక్కటి ప్రతిభను కనపర్చారు. తెనాలిలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో విజేతగా నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు.



ట్రిపుల్ జంప్‌లో రాణింపు: ఆడ పిల్లలు తక్కువ కాదంటూ పోటీ లోకి దిగి అందరి మన్ననలు అందు కుంటోంది అత్తోట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థిని **కె.సుస్మరాణి**. తెనాలి డివిజన్ స్థాయిలో జరిగిన ట్రిపుల్ జంప్ పోటీల్లో గెలుపొంది జిల్లా స్థాయి పోటీల్లో చోటుదక్కించుకుంది. జిల్లా స్థాయి పోటీల్లో విజేతగా నిలిచింది.

వసతిగృహాల్లో న్యాయమూర్తి తనిఖీ

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: తెనాలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీని యర్ డివిజన్) ఎం.శ్రీధర్ బుధ వారం నాజర్‌పేటలోని బీసీ, ఎస్సీ బాలుర ప్రభుత్వ వసతిగృహాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థు లతో మాట్లాడుతూ వసతిగృహాల్లో వసతులు, ఆహార పదార్థ అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. పెరిగిన ధరల మేరకు మెస్‌ఛార్జీలు పెంచాలని, సన్న బియ్యం ఇప్పించాలని, పెండింగ్ మెస్, కాస్మోటిక్ ఛార్జీల బిల్లులు చెల్లిం చాలని ఉందని విద్యార్థులు తెలిపారు. వార్డెన్ కె.హేమలత పాల్గొన్నారు.



దస్త్రాలు పరిశీలిస్తున్న న్యాయమూర్తి శ్రీధర్

కొసరాజు మృతి పార్టీకి తీరని లోటు

పొన్నూరు, న్యూస్‌టుడే: తెదేపాలో క్రమ శిక్షణ గల నాయకుడు కొసరాజు వెంకట రాయు డని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధ వారం నిడుబ్రోలులో కొసరాజు వెంకట రాయుడు భౌతికకాయంపై తెదేపా జెండా కప్పి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్ల వీరయ్య చౌదరి, వివిధ రాజ కీయ పార్టీ నేతలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



వెంకట రాయుడు భౌతికకాయంపై తెదేపా జెండాను కప్పుతున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

నేటి నుంచి ఏఎన్‌యూలో యువజనోత్సవాలు

ఏ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాల యంలో గురువారం నుంచి ఈనెల 26 వరకు యువజనోత్సవాలు నిర్వహించనున్నారు. ఏఎన్‌యూ పరిధిలోని 25 కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ ఉత్సవాలలో పాల్గొంటున్నారని రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం చెప్పారు. మొత్తం 25 విభాగాలలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

డాక్టర్ కన్నెగంటి రమేష్ సేవలు అభినందనీయం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: మానవ రక్షణ అధ్యయన సంస్థ ద్వారా కృత్రిమ మేధ పరిశోధనలతో దేశానికి సేవలు అందిస్తున్న డాక్టర్ కన్నెగంటి రమేష్ అభి నందనీయులని ప్రవాస భారతీయుడు డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడి పేర్కొ న్నారు. కృత్రిమ మేధ ద్వారా దేశ రక్షణ, ఓడ రేవుల పరిరక్షణ అంశాలపై డాక్టర్ రమేష్ రూపొందించిన ప్రాజెక్టుకు అమె రికా స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం ఆమో దించి, సదస్సుకు ఆయన్ని ఆహ్వానించిన నేపథ్యంలో పట్టణంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ రమేష్‌ను డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడి ఘనంగా సత్కరించారు. తెనాలి వాసి అయిన డాక్టర్ రమేష్ సాధారణ స్థాయి నుంచి అసాధారణ గుర్తిం పును సొంతం చేసుకున్న వైనం స్ఫూర్తిదాయకమ న్నారు. సత్కార గ్రహీత డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 25 దేశాల ప్రాజెక్టులకు ఆమోదం లభించగా భారతదేశం నుంచి తన ప్రాజెక్టుకు మాత్రమే ఆమోదం లభించిందన్నారు. ఈ నెల 26వ తేది నుంచి 30వ తేది వరకు అక్కడ జరిగే సద స్సులో పాల్గొని తన పరిశోధన, ఆలోచనలను వివ రించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చెరుకుమల్లి సింగారావు, షేక్.అబ్దుల్ హకీంజాని, కన్నెగంటి గోపి చంద్, పొన్నం విజయ్, కంచర్ల వెంకటేశ్వరరావు, మణికుమార్, శ్రీనివాసరావు, అనిల్‌కుమార్ తదిత రులు పాల్గొన్నారు.



సత్కారం అందుకున్న కన్నెగంటి రమేష్‌తో డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడి తదితరులు

ఎన్‌సీసీ విద్యార్థులకు ధ్రువపత్రాలు పంపిణీ

నారాకోడూరు (చేబ్రోలు), న్యూస్‌టుడే: ఎన్‌సీసీ విద్యార్థులు సేవాభావాన్ని పెంపొందించుకోవాలని ఎంఈవో ప్రసాద్, అదనపు ఎంఈవో సుబ్బారావు అన్నారు. నారాకోడూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి విద్యను అభ్యసిస్తూ శిక్షణ పొందిన 34మంది విద్యార్థినులకు ఎన్‌సీసీ ఏ ధ్రువపత్రా లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ విద్యార్థినులు అంతా దేశ రక్షణలో భాగస్వాములు కావాలన్నారు. 10వ బెటాలియన్ కమాండింగ్ అధికారి సుదర్శన్ ఆధ్వ ర్యంలో శిక్షణ పొందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యా యుడు ఏడుకొండలు తెలిపారు.

దుస్తులు అందజేత

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: చినరావూరు డొంకరోడ్డులోని పేద మహిళలకు బుధవారం వస్త్రాలు పంపిణీ చేసినట్లు ఆర్పీఐ(ఎ) పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్నాటి నాగరాజు ప్రకటనలో పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు?

చేబ్రోలు, న్యూస్‌టుడే: ఒడిశా నుంచి తక్కువ ధరకు గంజాయిని ఇక్క డకు తీసుకువచ్చి చిన్న చిన్న పొట్లాలుగా కట్టి ఇంజినీరింగ్ కళాశాలలు, స్పిన్నింగ్ మిల్లుల వద్ద విక్రయిస్తున్న సమాచారం మేరకు పోలీసులకు గాలింపు చర్యలు చేపట్టారు. చేబ్రోలులోని ఓ స్పిన్నింగ్ మిల్లు వద్ద ఒడిశా రాష్ట్రానికి చెందిన నలుగుర్ని బుధవారం సాయంత్రం పొన్నూరు రూరల్ సీఐ కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్సై వెంకటకృష్ణ అదుపులోకి తీసుకున్నారు. సుమారు 26 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. మరో ఇద్దరు కోసం గాలిస్తున్నట్లు తెలిసింది.

ద్విచక్రవాహనాలు ఢీ నలుగురికి తీవ్ర గాయాలు

ముట్లూరు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో నలుగురికి తీవ్ర గాయాల య్యాయి. ఈ ఘటనపై వట్టిచెరుకూరు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసనాయక్ తెలిపిన వివరాల మేరకు. . మంగళవారం తేదీ రాత్రి చేబ్రోలు నుంచి ముట్లూరు గ్రామానికి కాకు మాను జాన్‌బాబు తన కుమార్తెతో బైక్‌పై బయలుదేరారు. అదే సమ యంలో ముట్లూరు నుంచి తిరుమలశెట్టి నాగార్జున, మరో వ్యక్తితో కలిసి బైక్‌పై వస్తున్నారు. ఎదురెదురుగా వస్తున్న ఈ రెండు వాహనాలు ఢీకొ నడంతో నలుగురికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను గుంటూరు నగరంలోని వైద్యశాలలకు తరలించారు. ప్రస్తుతం వారి పరి స్థితి నిలకడగా ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ చెప్పారు.

చిన్నారులకు ఆహ్లాదం దూరం

✤ మాటలతో వైకాపా ప్రభుత్వం కాలయాపన



అంబేడ్కర్‌నగర్‌లో పార్కులో పిచ్చి మొక్కలు

పొన్నూరు, న్యూస్‌టుడే

వైకాపా పాలనలో పట్టణంలోని పార్కుల్లో క్రీడా పరికరాలు కొనుగోలు, ప్రహరీల నిర్మాణ పనులకు నిధులు మంజూరుకు ఆ పార్టీ నేతలు ఆర్భా టంగా ప్రకటించారు. సంవత్సరాలు గడిచినా అవి ఉత్తుత్తి మాటలుగానే మిగిలిపోయాయి.

✤ పట్టణంలోని 20వ వార్డు శాంతినగర్ పార్కులో జారుడు బల్ల, రంగులరాట్నం, సీత అనే ఆట వస్తువులను అందుబాటులో ఉన్నాయి. కాలక్రమేణా ఆట వస్తువులు ఒక్కొక్కటిగా మూలకు చేరాయి. పాడైపోయిన వాటిని తొలగించి నూతన ఆట వస్తువుల కొనుగో లుకు 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.10 లక్షలు నిధులు మూడున్నర సంవత్సరాల కిందట మంజూరు చేశారు. సంవత్సరాలు గడిచినా క్రీడా పరికరాలు అందుబాటులోకి తీసుకురాలేదు. ఆట వస్తువులు అందుబా టులో లేకపోవడంతో చిన్నారులు ఆడుకొనే అవకాశం లేకపోవడంపై ఆవేదన చెందు తున్నారు.

✤ 23వ వార్డు అంబేడ్కర్‌నగర్ పార్కు చుట్టూ ప్రహరీ, తలుపులు లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. పిచ్చి మొక్కలు దట్టంగా పెరగడంతో విష సర్పాలు సంచరిస్తున్నాయి. పార్కు చుట్టూ ప్రహరీ, తలుపులు ఏర్పాటుకు మూడున్నర సంవత్సరాలు కిందట 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.12.50 లక్షలు నిధులు మంజూరు చేయగా. . కాగితాలకు పరిమితం చేశారు. కూటమి ప్రభుత్వం జోక్యం చేసుకుని శాంతినగర్, అంబే డ్కర్‌నగర్, విద్యానగర్, నిడుబ్రోలులోని పార్కుల్లో మౌలిక వస తులు, క్రీడా పరికరా లను అందుబాటులోకి తెచ్చే విధంగా తగు చర్యలు తీసుకోవాలని పుర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



శాంతినగర్‌లో జారుడుబల్లపై రంధ్రం

చర్యలు తీసుకుంటాం.. పురపాలక సంఘం సహాయ ఇంజి నీర్ అపర్ణను న్యూస్‌టుడే వివరణ కోరగా ప్రభుత్వ మార్గదర్శకాల ఆదేశాల మేరకు 25 శాతం లోపు పనులు ప్రారంభం కానీ వాటిని నిలి పివేయాలని ఆదేశాలు జారీ చేశారని, పురపాలక సంఘ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి మరలా పార్కుల్లో ఆట వస్తువులను ఏర్పాటు చేసే తగు చర్యలు తీసుకుంటామన్నారు.

పోటీ పడ్డారు.. ప్రతిభచాటారు



విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న తిలక్‌బాబు



వ్యాసం రాస్తున్న విద్యార్థులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: విద్యార్థులు సమాజంపై అవగాహన పెంపొందించుకోవాలని ఎన్‌ఆర్‌ఐ ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ తిలక్‌బాబు అన్నారు. కొత్తపేటలోని ఎన్‌ఆర్‌ఐ ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్‌లో బుధవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీ పరీక్షలు జరిగాయి. ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు-విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కేవీఎల్ ప్రసన్న, కె.రిషి, ఓ.నీలిమ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను స్కూల్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ తిలక్‌బాబు అందజేశారు. ప్రిన్సిపల్ బాలకృష్ణ, ఏజీఎం భాను తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ వసూళ్లు వేగవంతానికి చర్యలు

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: నగరంలో రెవెన్యూ వసూళ్లు వేగవంతం చేయాలని, ఇటీవల జరిగిన సర్వేలో ఆస్తి పన్ను లేని వాటికి వెంటనే పన్ను విధించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ పి.శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం జీఎంసీ కౌన్సిల్‌హాల్‌లో రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పన్ను వసూళ్లలో పురోగతి కనిపించాలన్నారు. పాతబకాయిల వసూలు, సర్వేలో గుర్తించిన నాలుగువేల ఆస్తులకు నూతనంగా పన్ను విధించాలని ఆదేశించారు. వార్డు సచివాలయాల వారీగా వాణిజ్య, గృహ అసెస్‌మెంట్‌లను పునర్ పరిశీలించాలన్నారు. సచివాలయాల వారీగా 100 శాతం డిమాండ్ నోటీసులు అందించాలని, క్షేత్రస్థాయిలో నోటీసుల పంపిణీని ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని చెప్పారు. పన్ను వసూలు చేయాలని వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నీటి పన్ను బకాయిలు చెల్లించని వారి కుళాయి కనెక్షన్లు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్ ఓబులేసు, డీసీ డి.శ్రీనివాసరావు, ఆర్‌వోలు రెహమాన్, రవికిరణ్‌రెడ్డి, శివన్నారాయణ, సాదిక్ బాషా, సూపరింటెండెంట్ వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

వలస కార్మికులకు చట్టాలు అమలు చేయాలి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: భవన నిర్మాణరంగంలో పనిచేస్తున్న వలస కార్మికులకు కార్మిక చట్టాలు అమలు చేయాలని సీఐటీయూ తూర్పు కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం సంజీవనగర్‌లోని కార్యాలయంలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వలస కార్మికులకు రేషన్‌కార్డు ఇచ్చి వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. నాయకులు దీనెరాజు, రాజు, సారధి, జాన్‌బాబు, విమల్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్యదర్శి శ్రీనివాసరావు

జూట్‌మిల్లుల్లో అక్రమాల నిగ్గు తేల్చాలి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: భజరంగ్ జూట్ మిల్లులో అక్రమాలను తవ్వితే అనేక విషయాలు బయటకు వస్తాయని జై భీమ్ కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిల్లి బాబూరావు అన్నారు. గుంటూరులో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జూట్ మిల్లును తెరిపించే క్రమంలో భాగంగా కార్మికుల వేతనాన్ని రూ.23 తగ్గించుకుని రూ.44కు పని చేశారన్నారు. కార్మికుల కష్టంతో లాభాల బాటలో పయనించిన జూట్‌మిల్లు స్థలాలపై కన్నేసిన అప్పటి ప్రజాప్రతినిధులు యాజమాన్యంతో కుమ్మక్కై నష్టాలు వస్తున్నాయన్న సాకుతో అక్రమంగా లాకౌట్ చేశారన్నారు. జూట్‌మిల్లుకు సంబంధించిన స్థిర, చరాస్తులు మొత్తం కార్మికులకే చెందుతాయన్నారు. కార్మికుల ఇళ్లు నిర్మించాల్సిన స్థలంలో అక్రమంగా అపార్ట్‌మెంట్లు నిర్మించారని చెప్పారు. కార్మికులకు తీవ్ర ద్రోహం చేసిన అంబటి రాంబాబు, మురళీపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మిల్లుకు సంబంధించిన రూ.1,200 కోట్ల విలువైన ఆస్తుల్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సహన కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: తెనాలికి చెందిన సహన మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని, మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. బుధవారం జీజీహెచ్‌లో సహన కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తమ సానుభూతి తెలిపారు. నాయకులు భావన్నారాయణ, నళినీకాంత్, నాగేశ్వరరావు, సూరిబాబు, కృష్ణకాంత్ ఉన్నారు.



సహన కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సభ్యులు

నిందితులను కఠినంగా శిక్షించాలి..

నెహ్రూనగర్: సహన మృతికి కారకులైన నవీన్‌తోపాటు అతనికి సహకరించిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం జీజీహెచ్‌లో మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, సభ్యులు అరుణ్‌కుమార్ ఉన్నారు.



సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జంగాల అజయ్‌కుమార్, అరుణ్‌కుమార్

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పట్నంబజారు, న్యూస్‌టుడే: పల్నాడు బస్టాండు సెంటర్‌లోని కూరగాయల మార్కెట్ సెంటర్‌లో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని లాలాపేట పోలీసులు గుర్తించారు. మృతుని వయస్సు సుమారు 50 సంవత్సరాలు ఉంటుందని, తెల్ల రంగు టీషర్ట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భర్తపై ఫిర్యాదు

గుంటూరు నేరవార్తలు: భర్తపై భార్య ఫిర్యాదు చేసిన ఘటనపై బుధవారం నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణబాబుకాలనీకి చెందిన ధనలక్ష్మితో అచ్యుతరావుకు 15 ఏళ్ల కిందట వివాహమైంది. తరచూ తాగివచ్చి కొడుతున్నాడని, ఈ నెల 22న మద్యం మత్తులో తనపై దాడిచేయడంతో కంటికి దెబ్బ తగిలిందని ఆమె ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వీరానాయక్ తెలిపారు.

కరకట్టపై అపస్మారక స్థితిలో యువకుడు

హోటల్ యజమాని దాడి చేశారని అనుమానం

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని తుంగలవారిపాలెం సమీపంలోని కరకట్టపై బుధవారం సాయంత్రం గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉన్న యువకుడిని అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై కె.శ్రీనివాసరావు చెప్పారు. ఆయన కథనం ప్రకారం.. తుంగలవారిపాలెంకు చెందిన భోగిరెడ్డి నాగరాజు గుంటూరులోని ఓ కిచిడీ హోటల్ కొంతకాలంగా పనిచేస్తున్నాడు. యజమానులు జీతం ఇవ్వకపోవడంతో నాగరాజు పనిమానేసి స్వగ్రామానికి వచ్చాడు. బుధవారం జీతం కోసం తాను పనిచేసిన హోటల్‌కు వెళ్లి అడగ్గా వారు దాడి చేసి గాయపర్చి తుంగలవారిపాలెం సమీపంలోని కరకట్ట మీద పడేసి వెళ్లిపోయారు. వివరాలను నమోదు చేసి గుంటూరు పోలీసులకు సమాచారం ఇచ్చినట్టు ఎస్సై పేర్కొన్నారు.



అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న నాగరాజు

గుంటూరు తూర్పు

ధర వరలు



ఎన్టీఆర్ రైతు బజారులో ధరలు నిన్నటివి... (కిలో రూ.ల్లో) టమాటా 38, వంగ 24, బెండ 37, పచ్చిమిర్చి 39, కాకర 30, క్యారెట్ 46, క్యాలీఫ్లవర్ 38, క్యాబేజీ 28, బీర 29, దొండ 26, బంగాళదుంప 39, ఉల్లిపాయలు 38, గోరుచిక్కుళ్లు 28, దోస 34, పొట్ల 32, మునగ 8, పెద్ద చిక్కుళ్లు 74, చామదుంప 36, మునగ 8, గోంగూర 10, తోటకూర 20, కొత్తిమీర 30, బీట్‌రూట్ 33, కీర 24, క్యాప్సికం 64, అల్లం 70, ఫ్రెంచి బీన్స్ 94, సొర 16, అరటి 7.

- న్యూస్‌టుడే, పట్నంబజారు

రైతుబజార్ల కల నెరవేరేనా?

పట్నంబజారు, న్యూస్‌టుడే: తూర్పు నియోజకవర్గ పరిధిలో దాదాపు 60 వేల జనాభా ఉన్న లాలాపేట, దాని చుట్టుపక్క ప్రాంతంలో రైతుబజార్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లాలాపేట, సంగడిగుంట, లాంచెస్టర్‌రోడ్డు, చౌత్రా సెంటర్, బారాయిమాంపంజాసెంటర్, మసీదు సెంటర్ ప్రాంతాల్లో సరైన మార్కెట్లు లేక ప్రజలు పీవీకేనాయుడు కూరగాయల మార్కెట్‌కు వెళ్తున్నారు. లాలాపేట వాసులు రెట్టింపు ఆటో ఛార్జీలతో పాటు అధిక సమయాన్ని వెచ్చించాల్సి వస్తుంది. గతంలో అధికారులు చౌత్రాసెంటర్‌లో రైతుబజారు ఏర్పాటుకు రూపొందించిన ప్రణాళిక అటకెక్కింది.



చౌత్రాసెంటర్‌లో రైతుబజారు ఏర్పాటుకు నిర్మాణాలు చేసి ఇలా వదిలేశారు

నిర్వహణ భారం పేరుతో..

కొన్నేళ్ల కిందట సంగడిగుంటలో రైతుబజారు ఏర్పాటు చేశారు. వ్యాపారాలు సరిగా లేకపోవడంతో నిర్వహణ భారం అధికమైందని రైతుబజారును తొలగించారు. అప్పటి నుంచి లాలాపేట, సంగడిగుంట ప్రాంతవాసులకు కష్టాలు మొదలయ్యాయి. కొందరు వినియోగదారులు చేసేదేమీ లేక లాగుడు బండ్లపై వచ్చే చిరు వ్యాపారుల వద్ద కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు. మరికొందరు ఉదయం వేళల్లో బి.ఆర్. స్టేడియంలో వాకింగ్ చేసి తిరిగి వెళ్లే సమయంలో బస్టాండు సమీపంలోని ఎన్టీఆర్ రైతుబజారులో కూరగాయలు కొనుకుంటున్నారు.

జాడలేని సంచార వాహనాలు..

శివారు ప్రాంతవాసులకు సరసమైన ధరల్లో కూరగాయలు అందించాలనే లక్ష్యంతో మార్కెటింగ్‌శాఖ అధికారులు గతేడాది తూర్పు నియోజకవర్గ పరిధిలో రెండు సంచార రైతుబజార్లను ఏర్పాటు చేశారు. వాటి ద్వారా నిత్యం లాలాపేట, సంగడిగుంట, పొన్నూరురోడ్డు, చౌత్రా సెంటర్లలో కూరగాయల్ని విక్రయించేవారు. రైతుబజారులో విక్రయించే కూరగాయల ధరల కంటే సంచార రైతుబజార్లలో విక్రయించే కూరగాయల ధరలు అధికంగా ఉండడం, వాటి వాహనాలకు వినియోగించే పెట్రోలు ఛార్జీలు భరించలేకపోవడం తదితర కారణాలతో అధికారులు వాటిని నిలిపేశారు.

ఆటో ఛార్జీలు భరించలేక..

లాలాపేట నుంచి రైతుబజారుకు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. అక్కడికి వెళ్లేందుకు రెండు ఆటోలు మారాల్సి వస్తుంది. ఆటో ఛార్జీలు భరించలేక లాగుడు బండ్లపై వచ్చే కూరగాయలు కొనుగోలు చేస్తున్నాం. అధికారులు స్పందించి లాలాపేటలో రైతుబజారు ఏర్పాటు చేయాలి.

-మహేంద్ర

తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు

బయటి మార్కెట్‌లో అధిక ధరలు వెచ్చించి కూరగాయలు కొనుగోలు చేస్తున్నాం. వాటిల్లో నాసిరకం కూరగాయలు అధికంగా ఉంటున్నాయి. మార్కెట్‌లో కొందరు వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు.

- చంద్రిక

స్వచ్ఛత ఆవశ్యకత విద్యార్థులకు అవగాహన

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రజారోగ్య పరిరక్షణకు స్వచ్ఛత ఆవశ్యకత ప్రతి విద్యార్థికి తెలియజేయాలని కోన బాలప్రభాకరరావు నగరపాలకసంస్థ పాఠశాల హెచ్‌ఎం హైమారావు అన్నారు. బుధవారం వేణుగోపాల్‌నగర్‌లోని జీఎంసీ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛత అవగాహనపై ఐటీసీ ఎంఎస్‌కే మిషన్ సొసైటీ ఆధ్వర్యంలో కళాజాతా బృందంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చేతుల శుభ్రత, మరుగుదొడ్ల వినియోగం, పాఠశాలలో పరిశుభ్రత, ఆడపిల్లలు రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి జానపద పాటలతో తెలియజేశారు. కార్యక్రమంలో ఐటీసీ బృందం సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థుల ఎదుట ప్రదర్శన చేస్తున్న కళాజాతా బృందం

వ్యాధులు వ్యాపిస్తున్నా పట్టించుకోరా?

పట్నంబజారు, న్యూస్‌టుడే: పాత గుంటూరు బాలాజీనగర్ ప్రాంతవాసులు అపరిశుభ్ర వాతావరణం మధ్య జీవనం కొనసాగిస్తున్నారు. నివాస గృహాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో వ్యర్థపునీరు చేరి, దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఫలితంగా వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యర్థపునీటిని తొలగించేందుకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. కొద్ది నెలల కిందట కార్పొరేషన్ అధికారులు పాత గుంటూరు పరిసర ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న ఖాళీ స్థలాల్ని అభివృద్ధి చేసుకోవాలని స్థల యాజమానులకు నోటీసులు జారీ చేశారు. అయిన పరిస్థితిలో ఎటువంటి మార్పు కనిపించటం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఖాళీస్థలాల్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని పాత గుంటూరు వాసులు కోరుతున్నారు.



పాతగుంటూరు బాలాజీనగర్‌లో వ్యర్థపునీటిలో తేలియాడుతున్న నివాస గృహాల మధ్య ఉన్న ఖాళీస్థలాలు

అసలే ఇరుకు... ఆపై గోతులు

గుంటూరు తూర్పు, పశ్చిమ ప్రాంతాలను కలిపే శంకర్‌విలాస్ వంతెన అసలే ఇరుగ్గా ఉంటుంది. ఆపై గుంతలు. నిత్యం కిక్కిరిసిన వాహనాలతో ప్రయాణికులు నరకం చూస్తున్నారు. నగరంలోని ఈ ప్రధాన రైల్వే వంతెన నిర్వహణను గత వైకాపా ప్రభుత్వం గాలికి వదిలేసింది. కనీస మరమ్మతులు చేయకపోవడంతో గుంతలు పెద్దవిగా మారిపోయాయి. దీంతో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ జాం అవుతోంది. ఇటీవలే ఈ వంతెన విస్తరణ పనులకు నిధులు మంజురయ్యాయి. పనులు మొదలయ్యేవరకైనా ట్రాఫిక్ ఇక్కట్లు లేకుండా రహదారిని బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. - ఈనాడు గుంటూరు.



నిత్యం ట్రాఫిక్‌తో కిక్కిరిసి ఉండే శంకర్‌విలాస్ వంతెన



వంతెన రహదారి అంతా ఇలా గుంతలమయంగా..

మృతిపై అనుమానాలు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: గుంటూరు శివారు రెడ్డిపాలెంలోని ఓ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని మృతిపై అనుమానాలు ఉన్నాయని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ బృందం సదరు పాఠశాలను సందర్శించి విద్యార్థిని మృతిపై ఆరా తీశారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం అక్కడకు విచ్చేసిన డీఈవో శైలజతో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్ మాట్లాడారు. సదరు పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు సమీర్, సహాయ కార్యదర్శి యశ్వంత్, సభ్యులు పవన్ ఉన్నారు.



డీఈవో శైలజతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్, విద్యార్థిని కుటుంబ సభ్యులు

డిసెంబరు 26న సీపీఐ శతజయంతి ఉత్సవాలు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: సీపీఐ ఏర్పడి డిసెంబరు 26కు వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ నగర కార్యదర్శి మాల్యాద్రి పిలుపునిచ్చారు. బుధవారం కొత్తపేటలోని వాటర్ ట్యాంకుల వద్ద నగర కమిటీ సమావేశం నిర్వహించారు. నాయకులు సురేష్, నారాయణ, వెంకటేశ్వర్లు, సుబ్బయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ నగర కార్యదర్శి మాల్యాద్రి

నర్సింగ్ ఎన్నికల్లో కోటమ్మ ప్యానల్ విజయం

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: ప్రభుత్వ నర్సుల సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యవర్గ ఎన్నికల్లో భాగంగా సర్వజనాసుపత్రిలో రహస్య బ్యాలెట్ విధానంలో బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టారు. అధ్యక్షురాలిగా కోటమ్మ, కార్యదర్శిగా పద్మజ, కోశాధికారిగా హేమలత, ఉపాధ్యక్షురాలిగా శ్రీదేవి, కార్యవర్గ సభ్యులుగా ఆశాలత, సునీత, అరుణ, భాగ్యలక్ష్మి, సుదర్శిని ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తులసీబ్రహ్మమ్మ ప్రకటించారు. జిల్లా కార్యవర్గ ఎన్నికలు పూర్తయినందున త్వరలోనే రాష్ట్ర సంఘాన్ని ఎన్నుకోనున్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. వాహనదారులకు శాపం..

పట్నంబజారు, న్యూస్‌టుడే: నందివెలుగురోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డు విస్తరణలో భాగంగా కొద్దినెలల కిందట అధికారులు ఈ ప్రాంతంలో రోడ్డు పక్కన తవ్వకాలు చేశారు. రోజులు గడుస్తున్నా రోడ్డును నిర్మించడం లేదు. తెనాలి, నందివెలుగు, వెంకటకృష్ణాపురం, ఉప్పలపాడు, తక్కెళ్లపాడు వైపు వెళ్లే వారంతా ఇటువైపు నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు పక్కన చేసిన తవ్వకాలు కారణంగా అటుగా రాకపోకలు చేసే వాహనదారులు ప్రమాదవశాత్తు గుంతల్లో పడి గాయాల పాలవుతున్నారు. ఇటీవల అక్కడ పర్యటించిన ఎమ్మెల్యే నసీర్‌కు స్థానికులు వారి సమస్యను వివరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.



కార్మికుల హక్కులకు మజ్దూర్ సంఘం పోరాటం

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: రైల్వే కార్మికుల హక్కుల కోసం పోరాటం చేసే మజ్దూర్ యూనియన్‌కే ఓటేయాలని ద.మ.రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకరరావు విజ్ఞప్తి చేశారు. గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం గుంటూరు రైల్వే స్టేషన్‌తో పాటు పలు కార్యాలయాల్లో కార్మికులతో శంకరరావు మాట్లాడారు. కార్మికులకు ఏ ఇబ్బంది వచ్చినా తక్షణమే స్పందించే మజ్దూర్ సంఘం డిసెంబరు 4 నుంచి 6వ తేదీ వరకు జరిగే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ సాధించేవిధంగా మద్దతివ్వాలని కోరారు. సమావేశంలో సంఘ డివిజనల్ కార్యదర్శి ప్రసాద్, అధ్యక్షుడు మంజునాథ్, హెడ్ క్వార్టర్స్ బ్రాంచి కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో పోటీలకు తేజకృష్ణారెడ్డి ఎంపిక

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: ఎస్‌కేబీఎం మున్సిపల్ హైస్కూల్‌లో 9వ తరగతి విద్యార్థి ఎం.తేజకృష్ణారెడ్డి ఇటీవల జరిగిన అండర్-17 జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొని చిత్తూరు జిల్లా కాణిపాకంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్ తెలిపారు. తేజకృష్ణారెడ్డిని ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

94406 38515, 80085 73097

స్పందనకు వందనం

పూడిక తీత

నగరపాలకసంస్థ(గుంటూరు): సాంబశివపేట ప్రధాన రోడ్డులో డ్రెయిన్లలో వ్యర్థాలు చేరి వర్షం పడితే మురుగునీరు రహదారులపై చేరుతోందని స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా' ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్ గ్యాంగ్‌వర్క్స్ ఏర్పాటు చేసి సిల్ట్ తొలగించారు.

చెత్త తొలగింపు

ఆర్టీసీ కాలనీ యాదవ బజారు ప్రాంతంలో రహదారిపై చెత్త కుప్పలు పేరుకుపోయి ఉన్నాయని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.. వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు.

గుంతలు పూడ్చివేత

ఈనాడు స్పందన

పట్నంబజారు, న్యూస్‌టుడే: లాలాపేట గంజి బజారులో ప్రమాదకరంగా మారిన గుంతలను బుధవారం కార్పొరేషన్ అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఈ నెల 21న 'ఈనాడు'లో ప్రచురితమైన 'గంజి బజారు..సమస్యలతో బేజారు' కథనానికి అధికారులు స్పందించారు. గంజి బజారులో కొద్దిరోజుల కిందట తాగునీటి పైపులైన మరమ్మతుల కోసం గుంతల్ని తవ్వారు. మరమ్మతుల అనంతరం గుంతల్ని పూడ్చలేదు. కథనానికి స్పందించిన అధికారులు గుంతల్ని పూడ్చి మట్టితో రోడ్డును చదును చేశారు. అధికారులు చర్యలు తీసుకోవటం పట్ల ఆ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేశారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సత్కారం

నగరంపాలెం, న్యూస్‌టుడే: గుంటూరులో ఒక కార్యక్రమానికి హాజరైన కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని బుధవారం జిల్లా భాజపా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను భాజపా నాయకులు సత్కరించారు. భాజపా సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్‌నారాయణ, మాజీ మంత్రి శనక్కాయల అరుణ, నాయకులు శనక్కాయల ఉమాశంకర్, భీమినేని చంద్రశేఖర్, కొత్తూరు వెంకటసుబ్బారావు, శ్రీనివాసరెడ్డి, కుమార్‌గౌడ్, వై.వి.సుబ్బారావు, తిరుపతిరావు, వెలగలేటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారం పోయాక అత్యాచారాలు, కబ్జాలు కనిపిస్తున్నాయా?

గోరంట్ల, న్యూస్‌టుడే: వైకాపా ఐదేళ్ల పాలనలో జరిగినన్ని అత్యాచారాలు, హత్యలు, కబ్జాలు మునుపెన్నడూ జరగలేదని ముస్లిం సేన రాష్ట్ర అధ్యక్షుడు, వక్ఫ్ బోర్డు సంయుక్త కార్యదర్శి షేక్ సుభాని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైకాపా హయాంలో ఎంతో మందిపై అత్యాచారాలు, దాడులు జరిగితే బాధితులను పరామర్శించకపోగా కనీసం స్పందించలేదన్నారు. జగన్ ముందుగా పరామర్శించాల్సింది ఆయన తల్లి, చెల్లిని అని అన్నారు.

ముగిసిన అంతర్ కళాశాలల బాస్కెట్ బాల్ పోటీలు



ట్రోఫీతో విజయం సాధించిన గుంటూరు ఏసీ కళాశాల జట్టు

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గత రెండు రోజులుగా జరుగుతున్న అంతర్ కళాశాలల బాస్కెట్ బాల్ పోటీలు బుధవారంతో ముగిశాయి. మొత్తం 8 కళాశాలలకు చెందిన జట్లు పాల్గొనగా.. గుంటూరు ఏసీ కళాశాల మొదటి స్థానంలో నిలిచింది. చోడవరం ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాల రెండు, ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల మూడో స్థానంలో నిలిచాయి. విజేతలకు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య స్వరూపారాణి బహుమతులు ప్రదానం చేశారు. ఈ టోర్నమెంట్‌లో సత్తా చాటిన క్రీడాకారులను నవంబరు 1నుంచి 5 వరకు బెంగళూరులోని క్రైస్ట్ విశ్వవిద్యాలయంలో నిర్వహించే అంతర్ విశ్వవిద్యాలయాల బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌కు ఎంపిక చేస్తామని వ్యాయామ విభాగం సంచాలకులు ఆచార్య పాల్‌కుమార్ చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

గుంటూరు పశ్చిమ

ప్రతిభా పాటవ పోటీలు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: లక్ష్మీపురంలోని శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీలకు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు-విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశాలపై వ్యాసరచన పోటీల్లో 8, 9 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నివేదితరాజ్(తొమ్మిదో తరగతి) ప్రథమ, మౌనిక నాగలక్ష్మి ద్వితీయ, దీక్షిత(ఎనిమిదో తరగతి) తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్ వినీత, డీన్ హరిబాబు, ఇన్‌ఛార్జ్ ఫణి, సమన్వయకర్త మూర్తి, ఏవో శ్రీనివాసరావు తదితరులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.


విజేతలకు బహుమతులు అందజేసిన ప్రిన్సిపల్ వినీత, హరిబాబు తదితరులు

ఎన్నారై ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో....

పట్టాభిపురం, న్యూస్‌టుడే: విద్యానగర్‌లోని ఎన్నారై ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీలకు అనూహ్య స్పందన లభించింది. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు-విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 8, 9 తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీహిత(ఎనిమిదో తరగతి) ప్రథమ, భవ్యశ్రీ(తొమ్మిదో తరగతి) ద్వితీయ, కౌశిక్ తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రిన్సిపల్ నవీన్ చౌదరి, ఉపాధ్యాయులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.


విజేతలకు బహుమతులు అందజేసిన ప్రిన్సిపల్ నవీన్ చౌదరి

ప్రతిభ చాటారు

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్లలోని నవీన విద్యానికేతన్ హైస్కూల్‌లో బుధవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు 'అంతర్జాల వినియోగం వల్ల లాభనష్టాలు - విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వి. రమ్య(పదో తరగతి) ప్రథమ, మేరీ బెనిత(9వ తరగతి) ద్వితీయ స్థానం, ఉల్లి నిఖిల (8వ తరగతి) తృతీయ స్థానంలో నిలిచారు. నవీన విద్యానికేతన్ హైస్కూల్ ఛైర్మన్ వై. చిన్నపరెడ్డి, డైరెక్టర్ వై. నవీన్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ వై. చిన్నమ్మ, ఇన్‌ఛార్జి కె. హరికృష్ణ, బి.సిద్ధారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులను అందజేస్తున్న వై.చిన్నపరెడ్డి, వై.నవీన్‌రెడ్డి, వై.చిన్నమ్మ తదితరులు



పట్టాభిపురం, న్యూస్‌టుడే: కృష్ణనగర్ రైతుబజార్‌లో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో) టమాట 38, వంగ 45, బెండ 47, పచ్చిమిర్చి 44, కాకర 47, క్యారెట్ 45, బీర 48, క్యాబేజి 30, దొండ 32, బంగాళదుంప 39, ఉల్లిపాయలు 38, గోరుచిక్కుళ్లు 35, దోస 30, సొర 25, పొట్లకాయ 34, అరటికాయ 7, బీట్‌రూట్ 32, క్యాప్సికం 64, కీరదోసకాయ 24, కొత్తిమీర 30, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 45, అల్లం 70, వెల్లుల్లి 340.

అరకొర రహదారి నిర్మాణం..
రాకపోకలకు ఆటంకం

నగరంపాలెం, న్యూస్‌టుడే

నగరపాలక సంస్థ అధికారులు మస్తాన్‌దర్గా వెనుక వీధి నుంచి నగరంపాలెం మూడుబొమ్మల కూడలి వరకు రహదారి విస్తరణ పనులను దాదాపు 9 నెలల కిందట ప్రారంభించారు. రహదారికి ఇరువైపులా ఆనుకుని ఉన్న నివాసాల మెట్లతో పాటు చెట్లను కూడా నరికివేసి వెంటనే పనులు ప్రారంభిస్తున్నట్లు హడావుడి చేశారు. నెలలు గడుస్తున్నా రహదారి నిర్మాణం పూర్తి కాకపోవడంతో స్థానికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాగున్న రహదారిని అభివృద్ధి పేరుతో ఛిద్రం చేసి కనీసం అక్కడ ఏర్పడిన గోతులను సైతం పూడ్చకపోవడంతో ఆ మార్గంలో వెళ్లాలంటే ప్రయాణికులు నరకం చూస్తున్నారు.

వైకాపా హయాంలో ఎన్నికలకు కొద్ది నెలల ముందు సుమారు రూ.80 లక్షల అంచనాతో రహదారి నిర్మాణానికి నగరపాలక సంస్థ అప్పట్లో టెండర్లు పిలిచింది. టెండర్లు దక్కించుకున్న గుత్తేదారుడు ఆలస్యం చేయడంతో నిర్మాణ పనులు నిలిపోయాయి. తర్వాత ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు ముందుకు సాగలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడి సుమారు వంద రోజులు గడిచాయి. ఇటీవలే మస్తాన్‌దర్గా వెనుక వీధిలో సీసీ రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సుమారు 100 మీటర్ల మేర సీసీ రహదారి నిర్మించారు. మిగిలిన 400 మీటర్ల రహదారి నిర్మాణాన్ని వదిలేశారు. ఆ రహదారిలో ఎటు చూసినా మోకాళ్ల లోతు గోతులు ఉండడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని, ద్విచక్ర వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు.

వంద మీటర్లు నిర్మించి వదిలేసిన నగరపాలక సంస్థ అధికారులు


మస్తాన్‌దర్గా వెనుక వీధిలో అరకొరగా నిర్మించిన సీసీ రహదారి


పునీత ఆంతోని చర్చి వెనుక వీధిలో మోకాళ్ల లోతు గోతుల్లో నిలిచిన వర్షపు నీటిలో వాహనాల రాకపోకలు

ఆ రోడ్డులో ప్రయాణం నరకం

ముఖ్యంగా నల్లచెరువు నుంచి కలెక్టరేట్ వైపుగా వెళ్లాలంటే మస్తాన్‌దర్గా వెనుక వీధి అనుకూలంగా ఉంటుంది. ఈ వీధి మీదుగానే కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, జిల్లా కోర్టు వంటి కార్యాలయాలతో పాటు పట్టాభిపురం, గుజ్జనగుండ్లకు చేరుకుంటారు. అధ్వానంగా మారిన రహదారిపై ప్రయాణం సాగించాంటే నరకంగా మారిందంటున్నారు వాహనచోదకులు. అసలే వర్షాకాలం కావడంతో భారీ గోతుల్లో వర్షం నీరు చేరడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు హడలిపోతున్నారు. రహదారిని పూర్తి స్థాయిలో నిర్మిస్తే వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని నగరవాసులు అంటున్నారు. బాగున్న రహదారిని ఛిద్రం చేసి నెలలు గడుస్తున్నా నగరపాలక సంస్థ అధికారులు పూర్తి చేయకపోవడం సరికాదంటున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ కమిషనర్ మస్తాన్‌దర్గా వెనుక వీధిలోని అసంపూర్తిగా నిలిచిపోయిన రహదారిని పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.


చెరువును తలపిస్తున్న మస్తాన్‌దర్గా వెనుక వీధి

సమస్యల పరిష్కారానికి సీఎం చంద్రబాబు హామీ

జిల్లాపరిషత్తు, న్యూస్‌టుడే: జిల్లాపరిషత్తుకు ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు విడుదల చేయడంతో పాటు జడ్పీ కార్యాలయం నూతన భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారని జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా తెలిపారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబుని క్రిస్టినా, ఆమె భర్త, తెదేపా నాయకుడు సురేష్‌కుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. ఛైర్‌పర్సన్‌కి ప్రభుత్వం తరపున వాహనం కేటాయించేందుకు అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారన్నారు.


చంద్రబాబుకు అర్జీ ఇస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

క్రీడాకారుడికి అభినందన

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: ఎస్‌కేబీఎం మున్సిపల్ హైస్కూల్‌లో 9వ తరగతి విద్యార్థి ఎం.తేజకృష్ణారెడ్డి ఇటీవల జరిగిన అండర్-17 జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొని చిత్తూరు జిల్లా కాణిపాకంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్ తెలిపారు. తేజకృష్ణారెడ్డిని ప్రధానోపాధ్యాయుడు పి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

టీచరు కొడుతుందేమోనని పిడుగురాళ్లకు చేరిన విద్యార్థులు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పాఠశాలలో ఇచ్చిన హోంవర్కు పూర్తి చేయకపోవడంతో టీచర్ కొడుతుందేమోనని ఇద్దరు విద్యార్థులు బడి బస్సు ఎక్కకుండా, ఆర్టీసీ బస్సెక్కి పిడుగురాళ్లకు వచ్చిన ఘటన ఇది. గుంటూరు నగరపాలెం ప్రాంతానికి చెందిన ఎస్.కె.అబ్దుల్‌ఖాదర్, సయ్యద్ మహ్మద్‌నిహర్‌లు స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నారు. పాఠశాలలో మంగళవారం టీచరు హోంవర్కు ఇచ్చారు. ఇద్దరూ చేయలేదు. పాఠశాలకు వెళితే టీచరు కొడుతుందని ఇద్దరూ భయపడి పాఠశాలకు వెళ్లకుండా, ఆర్టీసీ బస్సెక్కి పిడుగురాళ్లలోని ఐలాండ్ సెంటరుకు వచ్చారు. దుకాణాల వద్ద తిరుగుతుండగా వ్యాపారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై ఎం.మోహన్ వచ్చి పిల్లలను స్టేషన్‌కు తీసుకెళ్లారు. సీఐ ఎస్.వెంకట్రావు, ఎస్సై మోహన్‌లు పిల్లలను విచారించి వారి తల్లిదండ్రుల పేర్లు, అడ్రసు అడిగి తెలుసుకొన్నారు. వారిని పోలీసు స్టేషన్‌కు రప్పించి పిల్లలను అప్పగించారు.

కార్మికుల హక్కులకు మజ్దూర్ సంఘం పోరాటం

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: రైల్వే కార్మికుల హక్కుల కోసం పోరాటం చేసే మజ్దూర్ యూనియన్‌కే ఓటేయాలని ద.మ.రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకరరావు విజ్ఞప్తి చేశారు. గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం గుంటూరు రైల్వే స్టేషన్‌తో పాటు పలు కార్యాలయాల్లో కార్మికులతో శంకరరావు మాట్లాడారు. కార్మికులకు ఏ ఇబ్బంది వచ్చినా తక్షణమే స్పందించే మజ్దూర్ సంఘం డిసెంబరు 4 నుంచి 6వ తేదీ వరకు జరిగే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ సాధించేవిధంగా మద్దతివ్వాలని కోరారు. సమావేశంలో సంఘ డివిజనల్ కార్యదర్శి ప్రసాద్, అధ్యక్షుడు మంజునాథ్, హెడ్ క్వార్టర్సు బ్రాంచి కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: టీజేపీఎస్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులు ఎం.విద్యాసాగర్‌రెడ్డి, ఎస్.కె.కాశీ, వై.చందు, జి. నరేంద్రబాబు నగరంలోని ఓ ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి రక్తదానం చేసి కాపాడారని కళాశాల ఇంఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. అనితాదేవి బుధవారం తెలిపారు. విద్యార్థులను కళాశాల కార్యదర్శి, కరెస్పాండెంట్ కేవీ బ్రహ్మం అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ జె.వి.సుధీర్‌కుమార్, జాతీయ సేవా పథకం కార్యక్రమ నిర్వహణ అధికారి ఆర్.జయశైలజ పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో టమాటా



టమాటా ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో రాయితీ ధరలకు ప్రభుత్వం సరఫరా చేస్తోంది. బహిరంగమార్కెట్లో ప్రస్తుతం కిలో రూ.80 వరకు ఉంది. ఈ నేపథ్యంలో కిలో రూ.38కే రైతుబజార్లలో అందించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ప్రతీ రైతుబజార్‌కు 1,800 కిలోల చొప్పున సరఫరా చేసింది. గత మూడు వారాలుగా సబ్సిడీపై అందుబాటులో ఉంచడంతో వినియోగదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. **- ఈనాడు గుంటూరు.**

ఈఏ ల్యాబ్‌కు 27 మంది ఎంపిక

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్ల సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో బుధవారం ఈఏ ల్యాబ్ ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య తెలిపారు. కళాశాల నుంచి 77 మంది పాల్గొనగా ఫైనల్ విభాగంలో 27 మంది ఎంపికైనట్లు తెలిపారు. వీరిని అభినందించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ ప్రేమ దివ్య, హెచ్‌ఆర్ఎస్ నిపుణులు జాన్ డేవిడ్, ఉపాధి కల్పన అధికారి డాక్టర్ జె.ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవి

రూ.2.33 కోట్ల పనులకు శ్రీకారం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గత అయిదేళ్లుగా అటకెక్కిన అభివృద్ధిని చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి గాడిలో పెడుతున్నారని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. 25వ డివిజన్‌లో రూ.2.33 కోట్లతో సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణాలకు బుధవారం ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్ పర్యటనల్లో క్షేత్ర స్థాయిలో గుర్తించిన సమస్యల్ని అక్కడికక్కడే అధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి అంచనాలు రూపొందించి నిధులు మంజూరు చేయించామన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని డివిజన్లలో సమాన స్థాయిలో అభివృద్ధి పనులు చేపడతామని స్పష్టం చేశారు. గతంలో ఎమ్మెల్యేలెవరూ ఇటువైపు రాలేదని, మాధవి రెండు సార్లు పర్యటించి వెంటనే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు గాలం వెంకటేశ్వర్లు, కసుకుర్తి హనుమంతురావు, కదిరి సంజయ్, నగరపాలకసంస్థ ఈఈ సుందరరామిరెడ్డి, డీఈ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మకాలనీ.. సమస్యలు తీర్చేదెవరు?

ఏటి అగ్రహారం, న్యూస్‌టుడే

నగరంలోని 28వ డివిజన్‌లోని సీతమ్మకాలనీలో సమస్యలు తిష్ఠ వేశాయి. కనీస వసతుల్లేక అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిపోయింది. కాలనీలో కొన్నిచోట్ల మాత్రమే రహదారులు నిర్మించారు. మెయిన్‌రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారింది. గుంతల్లో నీరు నిలవడంతో వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాల బారిన పడాల్సిందే. రోడ్లు మెరుగుపర్చాలని గత అయిదేళ్లూ ఎన్నిసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని స్థానికులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఎమ్మెల్యే గళ్లా మాధవి అయినా స్పందించి తమ సమస్యలు తీర్చాలని కోరుతున్నారు.


సీతమ్మకాలనీ రహదారి దుస్థితి


రహదారిపైనే చెత్త నిల్వలు

కాలువలు సక్రమంగా లేకపోవడంతో..

కొన్నిచోట్ల సైడ్ కాలువలు సక్రమంగా లేకపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతుంది. కొన్నిచోట్ల సైడ్ కాలువలు ఉన్నా పూడుకుపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. దీంతో దోమలు, దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

★ వీధి దీపాలు సగానికి పైగా వెలగడం లేదు. నెల రోజులైనా దీపాల నిర్వహణ చేసేవారు లేరని స్థానికులు వాపోతున్నారు. దీంతో రాత్రి వేళల్లో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

★ కాలనీలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉండడంతో దోమలకు, పాములకు ఆ ప్రాంతం ఆవాసంగా మారింది. వాన నీరు ఖాళీ స్థలాల్లో నిలుస్తోంది.


వెలగని విద్యుత్తు దీపాలు

★ రాత్రి వేళల్లో విష పురుగులు, సర్పాలు తిరుగుతున్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనలతో గడుపుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైభవంగా శాంతి కల్యాణం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బ్రాడీపేట 2/7లోని శ్రీగౌరీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకస్వామి విశ్వేశ్వర శర్మ, బండారు పూర్ణచంద్రరావు, మలిశెట్టి రామకోటి గుప్త దంపతులతో కల్యాణ క్రతువు నిర్వహింప చేసారు. జంధ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్ కుమార్, మల్లికార్జునశర్మ, చక్రపాణి తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

అధికారం పోయాక అత్యాచారాలు కనిపిస్తున్నాయా

గోరంట్ల, న్యూస్‌టుడే: వైకాపా ఐదేళ్ల పాలనలో జరిగినన్ని అత్యాచారాలు, హత్యలు, కబ్జాలు మునుపెన్నడూ జరగలేదని ముస్లింసేన రాష్ట్ర అధ్యక్షుడు, వక్ఫ్ బోర్డు సంయుక్త కార్యదర్శి షేక్ సుభాని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైకాపా హయాంలో ఎంతో మందిపై అత్యాచారాలు, దాడులు జరిగితే బాధితులను పరామర్శించకపోగా కనీసం స్పందించలేదన్నారు.

నృత్య పోటీల్లో జ్ఞానితి ప్రతిభ

పట్టాభిపురం: ఇంటర్నేషనల్ కర్ణాటక మ్యూజిక్, డ్యాన్సర్ అసోసియేషన్ కాశీ విశ్వనాథ దేవాలయంలో నిర్వహించిన శివతాండవం నృత్య పోటీల్లో పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల 8వ తరగతి విద్యార్థిని తుమ్మూరు జ్ఞానితి ప్రతిభ కనబర్చిందని కార్యదర్శి విష్ణువర్ధన్ తెలిపారు. ఆమెను అకడమిక్ డైరెక్టర్ కృష్ణవేణి, ప్రిన్సిపల్ పద్మజ, అత్తోట సుబ్బారావు అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
97042 53525, 80085 74897

? బ్రాడీపేట 5/22వ లైన్‌లో ఇంటి నంబరు 5-67-97 దగ్గరున్న వీధిదీపం గత రెండు నెలలుగా వెలగడం లేదు. రాత్రి సమయాల్లో ఇబ్బందులు పడుతున్నాం. **- స్థానికులు, బ్రాడీపేట**

✔ వీధి దీపం వెలిగేలా చర్యలు తీసుకుంటాం.
- రవికిరణ్, ఏఈ, జీఎంసీ

? ఎస్పీ బంగ్లా రోడ్డు, అంకమ్మనగర్, ఆకువాలరితోట ప్రాంతాలకు వెళ్లే రహదారులపై విద్యుత్తు తీగలకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను సిబ్బంది కొట్టేసి రహదారిపైనే వదిలేశారు.
- అంకమ్మనగర్‌వాసులు

✔ పారిశుద్ధ్య సిబ్బందితో చెట్టుకొమ్మలను తొలగిస్తాం.
- సోమశేఖర్, జీఎంసీ శానిటరీ సూపర్‌వైజర్

కాలువలో పూడిక తీత: ఏటీ అగ్రహారం 6వ లైన్‌లో కాలువల్లో చెత్త పేరుకుపోయి మురుగు నీరు ముందుకు కదలడం లేదు. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా జీఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన 89 శానిటరీ కార్యదర్శి సుశీలతో సిబ్బందిని పంపించి వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకున్నారు. **- న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం**

స్పందనకు వందనం

జూట్‌మిల్లులో అక్రమాల నిగ్గు తేల్చాలి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: భజరంగ్ జూట్ మిల్లులో అక్రమాలను తవ్వితే అనేక విషయాలు బయటకు వస్తాయని జై భీమ్ కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిల్లి బాబూరావు అన్నారు. గుంటూరులో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కార్మికుల కష్టంతో లాభాల బాటలో పయనించిన జూట్‌మిల్లు స్థలాలపై కన్నేసిన అప్పటి ప్రజాప్రతినిధులు యాజమాన్యంతో కుమ్మక్కై నష్టాలు వస్తున్నాయన్న సాకుతో అక్రమంగా లాకౌట్ వేశారన్నారు. కార్మికులకు ఇళ్లు నిర్మించాల్సిన స్థలంలో అక్రమంగా అపార్ట్‌మెంట్లు నిర్మించారని చెప్పారు. కార్మికులకు తీవ్ర ద్రోహం చేసిన అంబటి రాంబాబు, మురళీపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

నర్సింగ్ ఎన్నికల్లో కోటమ్మ ప్యానల్ విజయం

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: ప్రభుత్వ నర్సుల సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యవర్గ ఎన్నికల్లో భాగంగా సర్వజనాసుపత్రిలో రహస్య బ్యాలెట్ విధానంలో బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టారు. అధ్యక్షురాలిగా కోటమ్మ, కార్యదర్శిగా పద్మజ, కోశాధికారిగా హేమలత, ఉపాధ్యక్షురాలిగా శ్రీదేవి, కార్యవర్గ సభ్యులుగా ఆశాలత, సునీత, అరుణ, భాగ్యలక్ష్మి, సుదర్శని ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తులసీబ్రహ్మమ్మ ప్రకటించారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సత్కారం

నగరంపాలెం, న్యూస్‌టుడే: గుంటూరులో ఒక కార్యక్రమానికి హాజరైన కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని బుధవారం జిల్లా భాజపా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను భాజపా నాయకులు సత్కరించారు. భాజపా సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, మాజీ మంత్రి శనక్కాయల అరుణ, నాయకులు శనక్కాయల ఉమాశంకర్, భీమినేని చంద్రశేఖర్, కొత్తూరు వెంకటసుబ్బారావు, శ్రీనివాసరెడ్డి, కుమార్‌గౌడ్, వై.వి.సుబ్బారావు, తిరుపతిరావు, వెలగలేటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందుల అవశేషాలతో క్యాన్సర్లు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: ప్రమాదకర పురుగుమందుల అవశేషాలు ఆహార పదార్థాల్లోకి చేరితే రకరకాల క్యాన్సర్లకు దారితీస్తాయని జీజీహెచ్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ చెప్పారు. సర్వజనాసుపత్రి నాట్కో క్యాన్సర్ సెంటర్లో ప్రజా ఆలోచన వేదిక ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమతుల ఆహారంతో ప్రజలు సరైన జీవన శైలిని అలవర్చుకోవాలన్నారు. అనంతరం ఆచార్యులు దుర్గాప్రసాద్, శివరామకృష్ణ, వైద్యులు, సిబ్బందిని సన్మానించారు. నాట్కో క్యాన్సర్ సెంటర్ సమన్వయకర్త అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరకట్టపై అపస్మారక స్థితిలో యువకుడు

అవనిగడ్డ గ్రామీణం: తుంగలవారిపాలెం సమీపంలోని కరకట్టపై గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉన్న యువకుడిని అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై కె.శ్రీనివాసరావు చెప్పారు. ఎస్సై కథనం ప్రకారం.. తుంగలవారిపాలెంకు చెందిన భోగిరెడ్డి నాగరాజు గుంటూరులోని ఓ కిచిడీ హోటల్ పనిచేస్తున్నాడు. యజమానులు జీతం ఇవ్వకపోవడంతో స్వగ్రామానికి వచ్చాడు. బుధవారం హోటల్‌కు వెళ్లి జీతం అడగ్గా వారు దాడి చేసి గాయపర్చి కరకట్టపై పడేసి వెళ్లిపోయారు. వివరాలు నమోదు చేసి గుంటూరు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు ఎస్సై పేర్కొన్నారు.


ఆకట్టుకున్న స్టైల్స్, వీవ్స్ వస్త్ర ప్రదర్శన

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: గుంటూరులోని గుజ్జనగుండ్లలోని శుభమ్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన స్టైల్స్ అండ్ వీవ్స్ వస్త్ర ప్రదర్శన మహిళలను ఆకట్టుకుంటోందని నిర్వాహకులు మంజులత బుధవారం తెలిపారు. వివిధ రాష్ట్రాల డిజైనర్ల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ప్రదర్శనలో ఫ్యాషన్ ప్రియులు, మగువలు తమకు కావాల్సినవి కొనుగోలు చేస్తున్నారు. భారతీయ సంప్రదాయం ప్రతిబింబించేలా వస్త్ర శ్రేణులు ఉన్నాయని సందర్శకులు తెలిపారు. వివాహాలు, పండగలతోపాటు ఇతర ప్రత్యేక సందర్భాల్లో ధరించేందుకు ఉప్పాడ, కలంకారీ, మంగళగిరి చేనేత వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వన్ గ్రామ్ గోల్డ్ జువెల్లరీ ఉన్నాయని, ఈ ప్రదర్శన అక్టోబరు 25 రాత్రి 9 గంటల వరకు ఉంటుందని మంజులత తెలిపారు.


ప్రదర్శనలో పాల్గొన్న మహిళలు

విద్యార్థినుల ఉపకార వేతనాలకు రూ.లక్ష విరాళం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: కమ్మజన సేవా సమితి విద్యార్థినుల వసతి గృహంలోని విద్యార్థినుల ఉపకార వేతనాలకు న్యాయవాది, జీవితకాల సాహిత్య పురస్కార గ్రహీత, సేవాజ్యోతి ట్రస్ట్ ఛైర్మన్ మొవ్వా మృత్యుంజయరావు రూ.లక్ష విరాళం అందజేశారు. చెక్కును ఆయన సమితి కార్యదర్శి చుక్కపల్లి రమేష్‌కు బుధవారం అందజేశారు. మృత్యుంజయరావు మాట్లాడుతూ తన తండ్రి వెంకటచలపతిరావు శత జయంతి సందర్భంగా ఈ విరాళం అందజేశానన్నారు. ఈ మొత్తం నుంచి ఒక్కో విద్యార్థినికి రూ.పది వేల చొప్పున ఉపకార వేతనాలు అందజేయాలని కోరారు. చుక్కపల్లి రమేష్ మాట్లాడుతూ నూతన భవన సముదాయానికి ఉదారంగా విరాళాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వడ్లమూడి నాగేంద్రం, సంయుక్త కార్యదర్శులు గుంటుపల్లి కోటేశ్వరరావు, మర్రిపూడి సీతారామయ్య, సభ్యులు పెద్ది సాంబశివరావు, గౌరవ అధ్యక్షుడు కన్నెగంటి బుచ్చయ్య చౌదరి పాల్గొన్నారు.



రూ.లక్ష చెక్కును చుక్కపల్లి రమేష్‌కు అందజేస్తున్న మొవ్వా మృత్యుంజయరావు


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న జిల్లా ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతగుండ్ల రాజబాబు

ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా చీరల పంపిణీ

నగరంపాలెం, న్యూస్‌టుడే: సినీ నటుడు ప్రభాస్ పుట్టిన రోజు సందర్భంగా పేద మహిళలకు చీరలు పంపిణీ చేసినట్లు జిల్లా ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతగుండ్ల రాజబాబు తెలిపారు. బుధవారం ఇస్రాయేల్‌పేట ఒకటో లైనులోని చర్చి వద్ద వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కేకు కోసి అభిమానులకు పంచారు. అనంతరం మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు రమేష్, మస్తాన్, నాగమల్లి, ఇస్రాయేల్, బుడ్డి, దాసు, మహేష్, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

శారదాపీఠం భూముల్లో అక్రమాలు అన్నీ ఇన్నీ కావు

రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

ఈనాడు డిజిటల్, అమరావతి: శారదాపీఠం భూముల్లో సాగిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఎకరం రూ.20 కోట్ల ధర పలికే భూమిని కేవలం రూ.లక్ష చొప్పున 15 ఎకరాలను అప్పనంగా కట్టబెట్టారని వివరించారు. వెలగపూడిలోని సచివాలయంలో ఆయన బుధవారం మాట్లాడారు. 'సాంస్కృతిక కళాశాల ఏర్పాటు పేరుతో భూములను తీసుకుని వాటిని శారదా పీఠానికి మళ్లించుకునేందుకు అక్రమాలు చేశారు. వాటిని గుర్తించాం కాబట్టే లీజును రద్దు చేశాం. ఎర్రమట్టి దిబ్బలను సైతం గత పాలకులు కొల్లగొట్టారు. అక్రమాలన్నింటిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటాం' అని స్పష్టం చేశారు.

పట్టాలపై గంజాయి సేవనం..

రైలు ఢీకొని ఇద్దరు విద్యార్థుల మృతి


కిరణ్‌కుమార్


యాసిన్

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టాలపై కూర్చుని గంజాయి తీసుకుంటుండగా.. రైలు దూసుకురావడంతో ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. కదిరి రైల్వే పోలీసుల కథనం మేరకు... అన్నమయ్య జిల్లా పీలేరుకు చెందిన ఇంటర్ సెకండియర్ విద్యార్థి కిరణ్‌కుమార్ (18), అదే పట్టణానికి చెందిన ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి యాసిన్ (17) మంగళవారం రాత్రి చిత్తూరు మార్గంలోని రైల్వే ట్రాక్‌పైకి వెళ్లి గంజాయి తీసుకోవడం మొదలుపెట్టారు. అదే సమయంలో నాగర్‌కోయిల్ నుంచి ముంబయి వెళ్లే రైలు వీరిపై నుంచి దూసుకెళ్లింది. గంజాయి మత్తులో రైలు వస్తున్న విషయాన్ని వారు గమనించకపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. లోకో పైలట్ అందించిన సమాచారంతో సిబ్బంది అక్కడికి వెళ్లి చూడగా యాసిన్ చనిపోయి కనిపించాడు. కొన ఊపిరితో ఉన్న కిరణ్‌కుమార్‌ను తిరుపతి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కన్నుమూశాడు. ఇద్దరూ గంజాయికి అలవాటు పడ్డారని, వారి వద్ద గంజాయి పొట్లాలు దొరికాయని రైల్వే పోలీసులు తెలిపారు.

విద్యాసాగర్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

ఈనాడు, అమరావతి: ముంబయి సినీనటి కాదంబరి జెత్వానీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసిన కేసులో విజయవాడ కోర్టు ఈ ఏడాది సెప్టెంబర్ 23న తనకు రిమాండ్ విధించడాన్ని సవాల్ చేస్తూ వైకాపా నేత కుక్కల విద్యాసాగర్ దాఖలు చేసిన వ్యాజ్యంలో బుధవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి ప్రకటించారు. సాధ్యమైనంత త్వరలో నిర్ణయాన్ని వెల్లడిస్తామన్నారు.



ఇతరులు బాధపడతారని క్షమాపణ చెప్పొద్దు

మీరు తప్పు చేసినప్పుడే క్షమాపణ చెప్పండి. మీ కోసం తీసుకొనే నిర్ణయాలతో ఎదుటివారు బాధపడతారన్న ఆలోచనతో మాత్రం క్షమాపణ చెప్పకండి. అది వారి సమస్యే తప్ప మీది కాదు. మీరేదైనా కొత్తగా ప్రయత్నించి విఫలమైనప్పుడు, మీరేం కోరుకుంటున్నారో చెప్పినప్పుడు, మీ అభిప్రాయాన్ని వెల్లడించినప్పుడు, కుటుంబంతో గడపడానికి పనికి దూరంగా ఉండాల్సి వచ్చినప్పుడు మీరు తప్పు చేసినట్లు కాదు. ఆ సందర్భాల్లో ఎవ్వరికీ క్షమాపణలు చెప్పాల్సిన అవసరం లేదు.

– డేనియల్ ఆరోన్, రచయిత

స్వామి అడుగులకు మడుగులు!

- భూముల కేటాయింపులో ఉల్లంఘనలు
- ట్రస్టీ పేరుతో అభ్యర్థన.. ఉత్తరాధికారి పేరుతో కేటాయింపులు
- నాటి వైకాపా పాలనలో సర్వం మాయ

ఈనాడు-అమరావతి, విశాఖపట్నం: వివాదాస్పద పీఠాధిపతి స్వరూపానందేంద్రకు చెందిన శారదా పీఠానికి నాటి వైకాపా ప్రభుత్వం అడుగడుగునా వత్తాసు పలికింది. రూ.225 కోట్ల విలువచేసే 15 ఎకరాలను.. నిబంధనలు ఉల్లంఘించి రూ.15 లక్షలకు కట్టబెట్టారు. ఒకసారి ఉత్తరాధికారి, మరోసారి ట్రస్టీ పేరుతో వ్యవహారాలు నడిపి గందరగోళానికి తెరతీశారు. అభ్యర్థన ఒకరి పేరుతో రాగా.. కేటాయింపు మరొకరి పేరున జరిగింది. గత జులై 15న ముఖ్యమంత్రి చంద్రబాబు 'సహజ వనరుల దోపిడీ' పేరుతో విడుదల చేసిన శ్వేతపత్రంలో శారదా పీఠానికి కేటాయించిన భూముల వ్యవహారంపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. తదుపరి చర్యల్లో భాగంగా కలెక్టర్ నుంచి అందిన నివేదికపై మంత్రివర్గంలో చర్చించి ఎన్డీయే ప్రభుత్వం రద్దుచేసింది. భూముల కేటాయింపులో విశాఖ జిల్లా అధికార యంత్రాంగం గుర్తించిన ప్రధాన ఉల్లంఘనలు ఇవీ..

★ నిబంధనల ప్రకారం ట్రస్టు నిర్వాహకులు, పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పేరున కాకుండా పీఠం ఉత్తరాధికారి పేరున ఆ భూములను బదలాయించకూడదు.

★ తొలుత 2.9.2021న పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి 15 ఎకరాలు కావాలని అభ్యర్థించారు. శాశ్వత బదలాయింపు కోసం ఉత్తరాధికారి ఫారం-29లో వివరాలు పూర్తిచేసి సమర్పించాల్సి ఉన్నా.. అవేమీ చేయలేదు.

★ అప్పటి ప్రభుత్వం స్వాత్మానందేంద్ర అభ్యర్థన మేరకు 24.10.2021లో భూములు బదలాయింపు జీఓ 571 ఇచ్చేసింది. ఆ తర్వాత పీఠం ట్రస్టీ చాగంటి ప్రకాశరావు ఫారం-29లో వివరాలు నింపి దరఖాస్తు చేశారు.

★ 29.11.2021న శారదా పీఠం ట్రస్టీ పేరున భూమిని బదలాయిస్తూ జీఓ 343ను ఇచ్చింది. వాస్తవానికి ఫారం-29 ఎవరు సమర్పిస్తారో వారి పేరున బదలాయించాలి. ఇక్కడ ట్రస్టీ చేయడంతో ఆయన పేరున జీఓ ఇచ్చారు. మొదట ఉత్తరాధికారి పేరున ఒక జీఓ ఇచ్చి, ట్రస్టీ పేరున మరొకటి విడుదల చేశారు.

★ తర్వాత భూముల్లో నిర్మాణాలు చేపట్టేందుకు వీలుగా, సర్వే నంబర్లు మార్చి ఇవ్వాలని శారదా పీఠం ట్రస్టీ అప్పటి రెవెన్యూ ఉన్నతాధికారులకు లేఖ రాశారు.

★ వెంటనే రెండు సర్వే నంబర్లలో ఉన్న భూములను ఒకే సర్వే నంబరు కింద మార్చి సవరించిన ఉత్తర్వులను ట్రస్టీ పేరున ఇచ్చారు. శాశ్వత బదలాయింపు ఉత్తర్వుల్లో స్వాత్మానందేంద్ర సరస్వతి పేరున ఇచ్చిన దాంట్లోనూ మార్చారు. 8.2.2022న నాటి ప్రభుత్వం 343 బదలాయింపు ఉత్తర్వులను సవరించి కొత్తగా శారదా పీఠం ఉత్తరాధికారి పేరున జీఓ 64ను కొత్తగా ఇచ్చింది. ఇలా ఒక్కోసారి ఒక్కొక్కరి పేరున నచ్చినట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి.

★ 20.11.2023న ఆధ్యాత్మిక, ట్రస్టు అవసరాల కోసం ఈ భూమిని ఆదాయ వనరుగా మార్చుకునేందుకు ప్రయత్నించారు. అందుకోసం అప్పటి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి పీఠం ఉత్తరాధికారి లేఖ రాశారు. వడ్డించే వాడు మనవాడైతే అన్నీ వస్తాయన్నట్లుగా ఒక రాయి వేశారు.

★ ఆ ప్రతిపాదించిన స్థలంలో ఘాట్ రోడ్డు నిర్మించేశారు. ప్రస్తుతం ఒక బోరు, షెడ్డు ఉంది.



డ్రైవింగ్ లైసెన్స్‌లో అవయవదానం వివరాలు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: డ్రైవింగ్ లైసెన్స్‌లో డ్రైవర్ వివరాలతో పాటు సామాజిక అంశాలకు కొత్తగా ప్రాధాన్యం ఇచ్చారు. డ్రైవర్ పేరు, చిరునామా, పుట్టిన తేదీ, అర్హత పొందిన వాహనం స్వభావం వివరాలతో పాటు అవయవదానం చేయడానికి సిద్ధంగా ఉన్నారా? అనే విషయాన్ని ఇటీవల ముద్రించారు. వీటితో పాటు డ్రైవర్ రక్త గ్రూపు, అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్, అర్హత పొందిన వాహనాల చిత్రాలనూ ముద్రించారు. దీనివల్ల ప్రమాదం జరిగిన సమయంలో సమాచారం ఇవ్వడానికి ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు.

రాజ్యలక్ష్మి దాతృత్వం ఆదర్శప్రాయం

- సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి


అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి అయ్యప్పరాజుకు రూ.15 లక్షల చెక్కు అందిస్తున్న జీఎస్టీ కమిషనర్ నరసింహారెడ్డి, సావిత్రమ్మ తదితరులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బ్యాంకులో దాచుకున్న రూ.61 లక్షల నగదును తన మరణానంతరం సామాజిక, స్వచ్ఛంద సేవా సంస్థలకు దానం చేసిన జీఎస్టీ విశ్రాంత సూపరింటెండెంట్ శిష్ట్లా రాజ్యలక్ష్మి దాతృత్వం అందరికీ ఆదర్శప్రాయమని సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. గుంటూరు కన్నావారితోటలోని జీఎస్టీ భవన్‌లో నరసింహారెడ్డి చేతుల మీదుగా వివిధ సేవా సంస్థలకు బుధవారం చెక్కులు అందజేశారు. నరసింహారెడ్డి మాట్లాడుతూ రాజ్యలక్ష్మి ఆదర్శ నిర్ణయం ఇతరులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆమె భౌతికంగా లేనప్పటికీ, తన దాతృత్వం ద్వారా అందరికీ మార్గదర్శిగా మిగిలిపోతారన్నారు. అనంతరం రాజ్యలక్ష్మి రాసిన వీలునామా ప్రకారం అమ్మ ఛారిటబుల్ ట్రస్టుకు రూ.15 లక్షలు, శిర్డీ సాయి సేవా ట్రస్ట్‌కు రూ.10 లక్షలు, శిష్ట్లా రాజ్యలక్ష్మి పేరుతో ఏర్పాటైన మెమోరియల్ ట్రస్ట్‌కు రూ.36 లక్షలు (చెక్కుల రూపంలో) రాజ్యలక్ష్మి తల్లి సావిత్రమ్మ సమక్షంలో ఆయా సంస్థల ప్రతినిధులు అయ్యప్పరాజు, దేవరశెట్టి సురేష్, చిట్టే వెంకట్‌లకు అందజేశారు. కార్యక్రమంలో రాజ్యలక్ష్మి సోదరుడు రామకృష్ణ, ఐఆర్ఎస్ అధికారులు బి.లక్ష్మీనారాయణ, వి.వెంకటేశ్వరరావు, మనోజ్‌కుమార్, కమల్ సీనా, రవికుమార్, నాగరాజు, జీఎస్టీ అధికారులు సీహెచ్. వెంకటేశ్వరరావు, గాదె శ్రీనివాసరెడ్డి, సీహెచ్. ఈశ్వర్, యుగంధర్, మూర్తి, పించనర్ల సంఘం తరఫున వివేకానంద, పీవీ సత్యనారాయణ, గుమ్మడి సీతారామయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు: మంత్రి సవిత


ఈనాడు, అమరావతి: త్వరలో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత తెలిపారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీని రీయింబర్స్‌మెంట్ చేయనున్నట్లు వెల్లడించారు. ట్రెండ్‌కు తగ్గట్టుగా నేత కార్మికులకు శిక్షణ ఇచ్చి మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు. మంగళగిరిలోని చేనేత కార్యాలయంలో బుధవారం వివిధ జిల్లాల డీడీలు, ఏడీలతో ఆమె సమీక్ష నిర్వహించారు. 'చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందించేందుకు కసరత్తు ప్రారంభించాం. చీరాలలో నూతనంగా టెక్స్‌టైల్స్ పార్కును ఏర్పాటు చేస్తాం' అని పేర్కొన్నారు.

రేపటి నుంచి మంత్రి లోకేశ్ అమెరికా పర్యటన

జార్జియాలో ఐటీ సర్వ్ సినర్జీ సదస్సులో కీలక ప్రసంగం

ఈనాడు డిజిటల్, అమరావతి: విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ శుక్రవారం నుంచి వచ్చే నెల 1 వరకు అమెరికాలో పర్యటించనున్నారు. ఆయా తేదీల్లో పలు సంస్థల ప్రతినిధులతో సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులకు గల అనుకూలతలపై చర్చిస్తారు. ఇందులో భాగంగా శాన్‌ఫ్రాన్సిస్కోలో ఒరాకిల్ సంస్థ ప్రతినిధులు, పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలతో 25న సమావేశమవుతారు. పత్ర సినర్జిస్, బోసన్, స్పాన్‌ఐఓ, క్లారిటీ, ఎడోబ్, స్కేలర్, జనరల్ అటమిక్స్ సంస్థల ప్రతినిధులు, భారత కాన్సుల్ జనరల్‌తో 26న భేటీ అవుతారు. ఆస్టిన్‌లోని పలు కంపెనీల ప్రతినిధులతో 27న, రెడ్‌మండ్‌లో మైక్రోసాఫ్ట్ ప్రతినిధులతో 28న భేటీ కానున్నారు. 29న అమెజాన్ సహా పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశం కావడంతోపాటు ఐటీ సర్వ్ సినర్జీ సదస్సులో కీలక ప్రసంగం చేయనున్నారు. ఈ నెల 30న కూడా వివిధ కంపెనీల ప్రతినిధులతో భేటీ అవుతారు. 31న జార్జియాలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. న్యూయార్క్‌లో పెట్టుబడిదారులతో నవంబరు 1న సమావేశమవుతారు.

పొట్ల కాదు వంకాయే!



శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం సవరడ్డపనస గ్రామానికి చెందిన చీడి విశ్వప్రసాద్ ఇంటి ఆవరణలోని ఓ వంగ మొక్క అడుగున్నర పొడవైన కాయ కాసింది. కర్ణాటకకు చెందిన ఓ రైతు దేశీయ కూరగాయలు సాగు చేస్తున్నట్లు విశ్వప్రసాద్ యూట్యూబ్‌లో చూసి తెలుసుకున్నారు. ఆయన్నుంచి 'ఇల్లీకుంబన్ ఎగ్ ప్లాంట్' రకం విత్తనాలు కొని, పోస్టులో తెప్పించుకున్నారు. వాటిని సేంద్రియ విధానంలో పెంచగా పొడవైన కాయ కాసింది. కేరళకు చెందిన ఈ రకం వంగ సాధారణంగానే పొడవైన కాయలు ఇస్తుందని ఉద్యాన అధికారిణి మంగమ్మ తెలిపారు. – న్యూస్‌టుడే, సారవకోట

వైకాపా హయాంలో.. రౌడీలను పెంచి పోషించారు

మాజీ మంత్రి పీతల సుజాత

ఈనాడు డిజిటల్, అమరావతి: వైకాపా హయాంలో గంజాయి సాగును నియంత్రించకపోగా, రౌడీమూకలను పెంచి పోషించారని మాజీ మంత్రి పీతల సుజాత విమర్శించారు. అందుకే రాష్ట్రంలో ప్రస్తుతం హత్యాచారాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక మత్తు పదార్థాల అమ్మకం, వినియోగంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉక్కుపాదం మోపుతున్నారని స్పష్టం చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు.

విశాఖ ఉక్కులో వీఆర్ఎస్ ప్రతిపాదన విరమించుకోవాలి: సీపీఎం

ఈనాడు, అమరావతి: విశాఖ ఉక్కు కర్మాగారంలో స్వచ్ఛంద పదవీ విరమణ ప్రతిపాదనను విరమించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. "విశాఖ ఉక్కు కర్మాగారంలో సర్వే పేరుతో ఉద్యోగులకు వీఆర్ఎస్ ఇచ్చి సాగనంపడాన్ని వ్యతిరేకిస్తున్నాం. ఉద్యోగులందరూ వీఆర్ఎస్ విధానాన్ని పూర్తిగా వ్యతిరేకించాలి. కార్మికుల పోరాట ఫలితంగా రెండో బ్లాస్ట్‌ఫర్నేస్ తెరుస్తున్న సమయంలో ఈ చర్య ఉత్పత్తిని దెబ్బకొడుతుంది. సెయిల్‌లో విలీనం చేయకుండా వీఆర్ఎస్‌ను ప్రవేశపెట్టడాన్ని కార్మికులు ప్రతిఘటించాలి" అని సూచించారు.

వెంకయ్యనాయుడు మనవడి నిశ్చితార్థం


విష్ణు నిశ్చితార్థ వేడుకలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తదితరులు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: దేశ మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు మనవడి నిశ్చితార్థ వేడుక గుంటూరు నగర శివారులోని శ్రీ కన్వెన్షన్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. వెంకయ్యనాయుడు కుమార్తె, అల్లుడు ఇమ్మని దీప, వెంకట్రావుల కుమారుడు విష్ణుకు.. తుమ్మల కోటేశ్వరరావు, రాధిక దంపతుల కుమార్తె సాయి సాత్వికతో నిశ్చితార్థ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వేడుకలో పాల్గొని జంటను ఆశీర్వదించారు. అంతకుముందు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును కలిసి ముచ్చటించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, కింజరాపు రామ్మోహన్‌నాయుడు, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, కామినేని శ్రీనివాసరావు, కన్నా లక్ష్మీనారాయణ, రఘురామకృష్ణరాజు, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

మహిళా ప్రత్యేక రక్షక దళం ఏర్పాటు చేస్తాం: హోంమంత్రి


క్రికెట్‌లో విజయం సాధించి విజయవాడ జోన్‌కు ట్రోఫీని అందజేస్తున్న హోంమంత్రి అనిత,

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆలయాల్లోని మహిళా భక్తుల కోసం మహిళా ప్రత్యేక రక్షక దళం ఏర్పాటు చేసేందుకు సీఎం చంద్రబాబుతో చర్చిస్తానని హోంమంత్రి అనిత చెప్పారు. ఏఎన్‌యూలో బుధవారం ఎస్‌పీఎఫ్ (ప్రత్యేక రక్షక దళం) నిర్వహించిన రైజింగ్ డే వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి నిర్వహించిన ఆటల పోటీల్లో విజయం సాధించిన వారికి మంత్రి అనిత, ఎస్‌పీఎఫ్ ఇన్‌ఛార్జి డీజీ త్రివిక్రమ వర్మ, ఏఎన్‌యూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ బహుమతులు ప్రదానం చేశారు. మంత్రి అనిత మాట్లాడుతూ గత ఐదేళ్లుగా నిలిచిపోయిన పదోన్నతులను వెంటనే ఇస్తామన్నారు. సీఐల నుంచి డీఎస్‌పీల ఉద్యోగోన్నతిపై ఇప్పటికే నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. పోలీసు శాఖలో రెవెన్యూ తెచ్చే విభాగం ఒక్క ఎస్‌పీఎఫ్ అని, ఈ విభాగం వల్ల ఏటా రూ.250 కోట్లు వస్తోందని మంత్రి చెప్పారు. ఇందులో కొంతమొత్తమైనా సిబ్బంది సంక్షేమం కోసం ఖర్చుచేస్తామన్నారు. విజయవాడ సమీపంలో సొంత భవనం నిర్మాణానికి స్థలం ఇచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రూ.280 కోట్లతో నూతన వాహనాలు కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని హోంమంత్రి అనిత తెలిపారు. కార్యక్రమంలో ఐజీ రామిరెడ్డి, కమాండెంట్ శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవ్యవస్థకు వన్నె తెచ్చిన జస్టిస్ లక్ష్మణరావు


జస్టిస్ లక్ష్మణరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జస్టిస్ శంకర్, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, డొక్కా మాణిక్యవరప్రసాద్, లక్ష్మణరెడ్డి తదితరులు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: న్యాయవాద వృత్తిలో 37 సంవత్సరాలు నిజాయతీగా కృషి పనిచేసి 1996లో పదవీ విరమణ పొంది.. 28 సంవత్సరాలు పాటు సామాజిక సేవచేసి న్యాయవ్యవస్థకు వన్నె తెచ్చిన ఆదర్శప్రాయులు జస్టిస్ అంబటి లక్ష్మణరావు అని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కేజీ శంకర్ అన్నారు. గుంటూరులోని భారతీయ విద్యాభవన్‌లోని బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఆడిటోరియంలో జస్టిస్ అంబటి లక్ష్మణరావు సంస్మరణ సభ బుధవారం నిర్వహించారు. విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కేజీ శంకర్ మాట్లాడుతూ అంబటి లక్ష్మణరావు వివాదాలకు దూరంగా వృత్తి ధర్మాన్ని నిర్వహించారని కొనియాడారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ గత 75 ఏళ్లలో భారత న్యాయవ్యవస్థ స్వర్ణయుగంలో ప్రమాణాలు నెలకొల్పిన న్యాయమూర్తులలో జస్టిస్ లక్ష్మణరావు ఒకరని ప్రశంసించారు. జనచైతన్య వేదిక అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ పలు సామాజిక కార్యక్రమాల్లో 2006 నుంచి జస్టిస్ లక్ష్మణరావుతో కలిసి పనిచేసే అవకాశం తనకు దక్కిందని పేర్కొన్నారు. జస్టిస్ లక్ష్మణరావు తన జన్మభూమి వెల్లలూరు గ్రామ అభివృద్ధికి విశిష్ట కృషి చేశారని పలువురు పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షులు రామచంద్రరాజు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, డాక్టర్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి మాట్లాడారు. జస్టిస్ అంబటి లక్ష్మణరావు కుమారుడు డాక్టర్ రామ్ పాపారావు మాట్లాడుతూ ఈనెల 27వతేదీన హైదరాబాద్‌లోని జలవిహార్‌లో లక్ష్మణరావు సంస్మరణ సభ ఏర్పాటుచేశామన్నారు. మేకల రవీంద్రబాబు, సీతారామయ్య, చక్రపాణి, రాము, హరి, లక్ష్మీనారాయణ, ఉమామహేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడారు. తొలుత జస్టిస్ లక్ష్మణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

కారులో వారిద్దరే వచ్చారు

యువతిపై రౌడీషీటర్ దాడి కేసులో సీసీ కెమెరాల విజువల్స్ సేకరించిన పోలీసులు


సహానను భుజంపై వేసుకుని వైద్యశాలకు వస్తున్న నవీన్, వెనుక అతని కారు (సీసీ కెమెరా చిత్రం)

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: రౌడీషీటర్ నవీన్ చేతిలో దాడికి గురై తొలుత బ్రెయిన్ డెడ్ అయి మంగళవారం మృతి చెందిన తెనాలి యువతి సహాన కేసులో పోలీసులు ఆయా ప్రాంతాల్లోని సీసీ కెమెరాల విజువల్స్‌ను సేకరించారు. ఈ నెల 19వ తేదీ రాత్రి సుమారు 7:30 గంటల సమయంలో నవీన్ కారు స్థానిక ప్రకాశంబజారులోని ఒక వైద్యశాల ఎదుట వచ్చి ఆగటం, అందులో నుంచి సహానను భుజంపై వేసుకుని నవీన్ హడావుడిగా వైద్యశాల్లోకి వెళ్లటం, అక్కడ సంబంధిత వైద్యులు లేరని చెప్పటంతో మరో వైద్యశాలకు ఆమెను పరుగున తరలించటం కెమెరాల్లో నమోదు అయింది. కారులో నవీన్, సహాన మాత్రమే ఉండటం, వైద్యశాలకు వచ్చే క్రమంలో సమయంలో రోడ్డుపై ఉన్న ఇరువురు నవీన్ స్నేహితులు అతనికి తోడుగా వెళ్లటం కూడా రికార్డు అయింది. కాగా వైద్యశాలలో సహాన తల్లితో నవీన్ మాట్లాడుతూ ఉన్న విజువల్స్‌ను కూడా పోలీసులు సేకరించారు. తమ బంధువులు వస్తే కొడతారని, వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపో అని సహాన తల్లి తనతో చెప్పటంతో తాను అక్కడి నుంచి వచ్చేసినట్లు విచారణలో నవీన్ పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. గుంటూరులో బాధిత యువతి కుటుంబాన్ని బుధవారం మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి పరామర్శించిన అనంతరం యువతి లైంగిక దాడికి గురైందని ఆరోపించిన నేపథ్యంలో ఈ విజువల్స్ అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. నిందితుడి అరెస్టు సమయంలోనూ కారులో వారిద్దరే వచ్చినట్లు తమ విచారణలో తేలిందని పోలీసులు స్పష్టం చేశారు.

అంతర పంటలు.. అన్నదాతకు మేలు

యడ్లపాడు, న్యూస్‌టుడే

ప్రణాళిక ప్రకారం కష్టించి పని చేస్తే వ్యవసాయం పండగ అని నిరూపించారు ఆ దంపతులు. ఉద్యాన సాగులో ఆటుపోట్లను అధిగమించి 15 ఏళ్లుగా రాణిస్తున్నారు. యడ్లపాడు మండలం చెంఘిజ్‌ఖాన్‌పేటకు చెందిన చేతరాజుపల్లి శ్రీనివాసరావు, సుబ్బరావమ్మలకు సొంత పొలం 3.5 ఎకరాలు ఉంది. దాని పక్కనే ఉన్న మరో ఎకరం కౌలుకు తీసుకున్నారు. ఉద్యాన పంటలకు అనుకూలమైన ఎర్రగరప నేల కావడంతో పూలు, కూరగాయలు సాగు చేస్తున్నారు. పొలంలో బోరు, బిందు సేద్య పరికరాలు ఏర్పాటు చేసుకుని సాగునీరు, ఎరువులు పొదుపుగా వాడుతున్నారు. అంతర సేద్యం, పురుగు మందుల పిచికారీ, కూరగాయలు, పూలు కోయడం శ్రీనివాసరావు దంపతులే చేసుకుంటారు. అవసరమైనప్పుడే కూలీలను పెట్టుకుంటారు. దిగుబడుల నిల్వకు పొలంలోనే ఓ గది నిర్మించారు. చేను వద్ద అమ్మగా మిగిలిన దిగుబడిని గుంటూరు, చిలకలూరిపేట మార్కెట్లకు తరలించి విక్రయిస్తున్నారు.


బంతిపూల తోటలో రైతు శ్రీనివాసరావు

సాగులో తొమ్మిది రకాలు..

బొప్పాయి, మునగ, బంతి, చిక్కుళ్లు, టమాటా ప్రధాన పంటలుగా సాగు చేశారు. అందులో అంతర పంటలుగా చామంతి 25 సెంట్లు, కనకాంబరం 25 సెంట్లు, కాకర 35 సెంట్లు, దోస 25 సెంట్లు సాగు చేశారు. ఈ ఏడాది అన్ని రకాల పంటలకు రూ.1.5 లక్షలు ఖర్చు చేశారు. కూరగాయలు దిగుబడికి సిద్ధంగా ఉన్నాయి. బంతి పూలు నాలుగు నెలలుగా దిగుబడి వస్తోంది. వాటిని చేను వద్దకు వచ్చి కిలో రూ.35 కొంటున్నారు. బంతి సాగుపై పెట్టిన ఖర్చులు పోగా ఇప్పటికి రూ.5 వేల ఆదాయం వచ్చింది. ఇటీవల కనకాంబరం పూల దిగుబడి ప్రారంభమైంది. ప్రస్తుతం మార్కెట్‌లో కనకాంబరం ధర కిలో రూ.1500 ఉంది. దాని పెట్టుబడి తిరిగా రాగా.. ఇప్పటికి అదనంగా రూ.10 వేల రాబడి వచ్చింది. కార్తిక మాసంలో ఇదే ధర కొనసాగితే ఆదాయం బాగుంటుందని రైతు ఆశాభావం వ్యక్తం చేశారు.

మెరుగైన ఆదాయం: శ్రీనివాసరావు, రైతు

పూలు, కూరగాయల సాగును జీవనోపాధి ఎంచుకున్నా. ఒక్కోసారి కూరగాయలు ధరలు అమాంతం పడిపోతాయి. అన్ని రకాల కూరగాయలు పండిస్తుండడంతో ధరలు ఉన్న పంటల్లో వచ్చిన ఆదాయంతో నష్టాన్ని భర్తీ చేసుకుంటున్నా. ఏడాది చివరిలో లెక్క చూసుకుంటే ఆదాయమే తప్ప నష్టపోలేదు. అన్ని రకాల పంటలపై ఖర్చులు పోను ఏడాదికి సుమారుగా రూ.1.5 లక్షలు ఆదాయం వస్తుంది.



రబీలో ఎర్ర సెనగ సాగుకు అనువైన వంగడాలతో పాటు ఎండు తెగులు, వేరు తెగుళ్ల నివారణ మార్గాలు ఏమిటి?
–లక్ష్మీనారాయణ, వెనిగండ్ల, పెదకాకాని మండలం



సమాధానం: ఎన్‌బీఈజీ-776 రకం ఎండు తెగులును తట్టుకుని యంత్ర కోతకు అనువుగా ఉంటుంది. ఎన్‌బీజీ-779, ఎన్‌బీజీ-452 రకాలు ఎండు తెగులును తట్టుకుంటాయి. కిలో సెనగ విత్తనాన్ని 10 గ్రా. ట్రైకోడెర్మా విరిడితో శుద్ధి చేసుకుంటే వేరుకుళ్లను సమర్థంగా అరికట్టవచ్చు. సెనగలో ఎండు తెగులు నివారణకు ఎకరానికి 2 కిలోల ట్రైకోడెర్మా విరిడి పొడిని, 2 కిలోల వేపపిండిని 90 కిలోల పశువుల ఎరువును కలిపి నీడలో కుప్పలా చేసుకుని తగిన తేమ కోసం నీటిని చిలకరించుకుంటూ 20 రోజులకు తెల్లటి బూజు ఏర్పడిన తర్వాత ఆఖరి దుక్కిలో చల్లుకోవాలి. ఎన్‌బీజీ-776, 779, 452 తదితర రకాలను సాగు చేసుకున్నట్లయితే ఎండు తెగులును సాధ్యమైనంత వరకు నివారించవచ్చు.


-డాక్టర్ ఎం.నగేష్, గుంటూరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త
-న్యూస్‌టుడే, జిల్లాపరిషత్తు(గుంటూరు)

నిమ్మ మొక్కలు నాటడంలో మెలకువలు



నిమ్మ మొక్కలు నాటేటప్పుడే తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉద్యానశాఖ హెచ్ఈవో శ్రీధర్ రెడ్డి తెలిపారు. నిమ్మసాగుకు నేలలో ఉదజని సూచిక ఎక్కువ ఉంటే అనువైనవి కాదని 6.5 నుంచి 7.5 వరకూ ఉంటే ఆ నేలలు సరైనవిగా భావించాలి. బంక నేలల్లో ఈ పంట వేయకూడదు. ఇసుక నేలలు, ఎర్ర గరప నేలలు ఎంతో అనుకూలం.

★ మొక్కకు మొక్కకు మధ్య 6 మీటర్ల దూరం ఉండాలి. నాటేందుకు ఒక నెల ముందుగానే గుంతలు తీసుకోవాలి. బిందు సేద్య పద్ధతి కూడా అనుసరించవచ్చు.

★ సంవత్సరం మొక్కల్ని ఎన్నుకోవాలి. ముదిరిన ఆకు లున్న వాటినే నర్సరీ నుంచి తీసుకోవాలి. పొడవు, వెడల్పు, లోతు 3 అడుగులు ఉండేలా గుంతలు తీసుకోవాలి. దానిలో పైపాటుగా వచ్చిన మట్టికి 30 నుంచి 40 కిలోల పశువుల ఎరువు, ఒక కిలో సింగిల్ సూపర్ పాస్ఫేట్ కలిపి గుంత మధ్యలో మొక్క నాటాలి. సేంద్రియ సాగు చేసే వాళ్లు సూపర్‌పాస్ఫేట్ వేసుకోకుండా సూడో మొనాస్, ట్రైకోడెర్మావిర్డీ మట్టికి కలిపి గుంతలో వేసుకోవాలి.

★ మొక్క ఎంపిక కీలకం. రంగపూర్ వేరు మూలాలున్న మొక్కలు నీటి ఎద్దడి, నీరు ఎక్కువైన పరిస్థితుల్ని తట్టుకుంటాయి. చనిపోయే శాతం తక్కువగా ఉంటుంది. అంటుమొక్కలు అవసరం లేదు. విత్తనం ద్వారా వచ్చినవే ఆరోగ్యంగా పెరుగుతాయి. ★ చెదలు ఎక్కువగా ఉంటే అక్కడ పైపాటు మట్టికి ఎరువు వేసేటప్పుడే కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు వేసుకోవాలి.

★ అంటు భాగం నేలకు 10 నుంచి 15 సెంమీ పైనే ఉండేలా నాటుకోవాలి. అంటు భాగం నేలలో ఉంటే చెమ్మతగిలి మొక్క చనిపోయే అవకాశం ఉంది. అంటు భాగం పైన తల్లి మొక్క వస్తుంది. దాని నుంచే దిగుబడి వస్తుంది. అంటుభాగం దిగువ నుంచి కొమ్మలు వస్తే వాటిని కత్తిరించేయాలి. ★ నీటి కోసం పాదుచేసుకోవాలి. నీరు ఎక్కువైతే వేరుకుళ్లు వస్తుంది. మొక్క పరిమాణాన్ని బట్టి నీరు చూసుకోవాలి. నేలలో ఉప్పదనం ఉంటే పల్లాకు తెగులు వచ్చే అవకాశం ఉంది. పెరుగుదల ఉండదు. మొక్క చనిపోతుంది. నిమ్మలో నీటి నాణ్యత అవసరం.

– దుగ్గిరాల, న్యూస్‌టుడే